# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 28-5-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:26 సంచిక:260 పేజీలు: 8 వెల: రూ.1/-


## 1నుంచి తెరుచుకోనున్న ఆలయాలు

### సన్నాహాలు చేస్తోన్న కర్నాటక సర్కార్

బెంగళూరు,మే27(ఆర్ఎన్ఎ): భక్తులకు కర్ణాటక ప్రభుత్వం శుభవార్త తెలిపింది. జూన్ 1 నుంచి ఆలయాలు తెరవనున్నట్లు కర్ణాటక ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు 51 ఆలయాల్లో దర్శనానికి బుధవారం నుంచే ఆన్‌లైన్ బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించి రెండు నెలలు దాటిపోయింది. ఇప్పటికే ప్రభుత్వాలు ఇచ్చిన లాక్‌డౌన్ సడలింపుల వల్ల అనేక కార్యకలాపాలు తిరిగి కొనసాగుతున్నాయి. దీంతో ఈ నెలాఖరుకు ముగియనున్న నాల్గవ లాక్‌డౌన్ అనంతరం దేవాలయాలను తెరవనున్న తొలి రాష్ట్రంగా కర్ణాటక నిలిచింది. త్వరలోనే ఆలయాల్లో దర్శనాలకు అనుసరించాల్సిన విధివిధానాలపై మార్గదర్శకాలను విడుదల చేయనుంది. అలాగే రాష్ట్రంలో మసీదులు, చర్చిలను తిరిగి ప్రారంభించే అంశంపై కేబినెట్ గురువారం చర్చ జరిపే అవకాశం ఉంది. కాగా కర్ణాటకలో నేడు కొత్తగా 100 కరోనా కేసులు వెలుగు చూడగా మొత్తం కేసుల సంఖ్య 2,282కు చేరింది. కరోనా కారణంగా 44 మంది మరణించగా 705 మంది కోలుకున్నారు.

# వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం




వానాకాలంలో రైతుల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.

రంగారెడ్డి, మే 27: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. అందుకోసం వానకాలంలో రైతులు లాభసాటి పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని చెప్పారు. రైతుల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి సీఎం కావడం రైతుల అదృష్టమని పేర్కొన్నారు. కందుకూరు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాచులూరు, గుమ్మడవెల్లి, మీర్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో వానకాలంలో రైతుల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో పాల్గొని మాట్లాడారు.

ఒకే పంటను రైతులు సాగుచేయడం వల్ల ధరలు తగ్గి తీవ్రంగా నష్టపోతారన్నారు. అందుకే సీఎం కేసీఆర్ లాభసాటి పంటలపై దృష్టి పెట్టి వ్యవసాయంలో మార్పు తీసుకవస్తున్నారని తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానం అమలు చేయడం వల్ల లాభాలు వస్తాయని ,వానాకాలంలో పత్తి, కంది పంటలతో పాటు ఉద్యాన పంటలు సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో లక్షల ఎకరాలు సస్యశ్యామయ్యావని, త్వరలో పాలమూరు, రంగారెడ్డి సాగునీటి పథకం ప్రారంభమవుతున్నట్లు చెప్పారు. అదే విధంగా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, నియోజక వర్గాలకు కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలిపారు. రైతులకు కావాల్సిన ఎరువులు విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. బదులు కంది, పత్తి, సన్నరకం వరి, కూరగాయాలను సాగుచేసుకోవాలని సూచించారు

## రాష్ట్రాల ద్వారానే నేరుగా సాయం అందించాలి

### -కేంద్ర ప్యాకేజీతో ఒరిగేదేమీ లేదు: హరీష్ రావు

సంగారెడ్డి,మే27(ఆర్ఎన్ఎ): కేంద్రం 20 లక్షల కోట్లు ప్యాకేజీ అందించినా పేదలకు, నష్టపోయిన రంగాలకు మాత్రం న్యాయం జరగలేదని మంత్రి హరీష్ రావు అన్నారు. నేరుగా ఎవరు కూడా లాభపడ్డ దాకలాలు లేవన్నారు. అనేక రంగాలకు అసలు ఎలాంటి ప్రయోజనం జరగలేదన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఉపాధి లేదని..టూరిజం, ఆటో మొబైల్, ఏవియేషన్ రంగం బాగా దెబ్బతిన్నాయని, హోటళ్ల రంగం దెబ్బతిన్నదని అన్నారు. కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. పూర్తి స్థాయిలో దెబ్బతిన్న రంగాలను కేంద్రం ఆదుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. బ్యాంకు లింకేజీతో అప్పులు రావడం చాలా కష్టమని...కేంద్రం నేరుగా సహాయం అందించాలని కోరారు. లేదంటే రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించేలా నిధులివ్వాలని తెలిపారు. లాక్‌డౌన్ సమయంలో ఎన్.జీ.ఓలతో పాటు చాలా మంది స్వచ్ఛందంగా ప్రజలకు సేవలందించడం సంతోషమని కొనియాడారు. వెయ్యి మందికి ఆర్ఆర్ ట్రస్ట్ జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు ఇవ్వడం సంతోషంగా ఉందని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు.

దుఃఖం పాటను
లేక లేక విన్నోళ్లకు
దుఃఖమొస్తుంది గానీ
జీవితమే దుఃఖమైనోళ్లకు
దుఃఖమెట్లా వస్తుంది?

-మునిమడుగుల రాజారావు

### చరిత్రలో నేటినిజం



కం॥ సురవరుడై, నరవరుడై
చరితను మథియించినట్టి శాస్త్రజ్ఞుండై
వర తెలగాణము న వెలిగె
"సురవరము ప్రతాప రెడ్డి" శోభిత గుణుడై॥

(మే 28 సురవరం ప్రతాప రెడ్డి జయంతి..)



-రాధశ్రీ
సెల్: 9494481210

## ప్రత్యేక రైలులో వలస కార్మికుడి మృతి

లక్నో,మే27(ఆర్ఎన్ఎ): వలసకార్మికులను తరలించేందుకు కేంద్రం ప్రత్యేక రైళ్ల సర్వీసులను నడిపిస్తోన్న విషయం తెలిసిందే. శ్రామిక్ స్పెషల్ ట్రైన్‌లో వెళ్తున్న ఓ వలస కార్మికుడు ప్రాణాలు విడిచాడు. సూరత్-హాజీపూర్ శ్రామిక్ స్పెషల్ ట్రైన్‌లో మంగళవారం సాయంత్రం 58 ఏండ్ల భూషణ్ సింగ్ చనిపోయినట్లు గుర్తించామని ఎస్పీ దేవేంద్రనాథ్ తెలిపారు. మృతుడు బీహార్‌లోని సరన్ జిల్లావాసి అని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగిస్తామన్నారు.

## తెరుచకున్న ఎనుమాముల మార్కెట్

### మార్కెట్లో కొనుగోళ్లు ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,మే27(ఆర్ఎన్ఎ): ఎనుమాముల మార్కెట్‌యార్డ్‌లో క్రయ, విక్రయాలు తిరిగి ప్రారంభమయ్యాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌యార్డ్‌లో నిలిచిపోయిన క్రయ విక్రయాలను 65 రోజుల తర్వాత బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో మంత్రి సోడియం హైపో క్లోరైడ్ ద్రావణాన్ని స్ప్రే చేయించారు. రైతులకు మాస్కులు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ఎనుమాముల మార్కెట్ దేశంలోనే అతి పెద్ద మార్కెట్ అన్నారు. రైతులకు మంచి గిట్టుబాటు ధర లభించే మార్కెట్ అన్నారు. మేలురకం మిర్చికి సరైన ధర రాలేదని రైతులు భావిస్తే కోల్డ్ స్టోరేజీలో పెట్టుకుంటే మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునే వెసులుబాటు ఉంటుందన్నారు. అదేవిధంగా పంట విలువలో వడ్డీ లేకుండా 75 శాతం అప్పుగా తీసుకునే అవకాశం ఉందన్నారు. వ్యాపారులు కేవలం లాభాపేక్షే కాకుండా కాస్త సేవా దృక్పందంతో వ్యవహరిం చాలన్నారు. రైతులకు అన్యాయం జరగకుండా కొనుగోళు చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన పంటలు వేస్తే రైతుకు ఎవరో న్యాయం చేయాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వం

నిర్ణయించిన పంటలు వేస్తే రైతులు లాభాల బాట పడతారన్నారు. కూరగాయలు, పూలు ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించుకుంటున్నాం. ఈ రకమైన పంటలు రైతులు వేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో మహబూబాబాద్, వరంగల్ అర్బన్, జనగాంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ సెజ్‌లను సీఎం కేసీఆర్ మంజూరు చేశారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్, మేయర్ గుండా ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదానందం, వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో లక్షన్నర దాటిన కరోనా కేసులు

### 5వేలకు చేరువవుతున్న మరణాల సంఖ్య

న్యూఢిల్లీ,మే27(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి భారత్‌ను గజగజ వణికిస్తోంది. వైరస్ విజృంభణ కొనసాగుతూనే ఉంది. కేసుల సంఖ్య లక్షన్నర దాటేసింది. మరణాల సంఖ్య 5వేలకు చేరువవుతోంది. రోజురోజుకు కరోనా మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. పాజిటివ్ కేసులు కూడా వేల సంఖ్యలో నమోదు అవుతున్నాయి. భారత్‌లో గడిచిన 24 గంటల్లో 6,387 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 170 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తంగా భారత్‌లో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 1,51,767కు చేరుకోగా, మృతుల సంఖ్య 4,337కు చేరింది. ఈ వైరస్ నుంచి 64,425 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. మహారాష్ట్రలో అత్యధికంగా 54,758 కేసులు నమోదు కాగా 1,792 మంది మృతి చెందారు. తమిళనాడులో 17,728 కేసులు(మృతులు 128), గుజరాత్‌లో 14,829(మృతులు 915), ఢిల్లీలో 14,465(మృతుల 288), రాజస్థాన్‌లో 7,536(మృతులు 170), మధ్యప్రదేశ్‌లో 7,024(మృతులు 305), యూపీలో 6,724(మృతులు 177), బెంగాల్‌లో 4,009 పాజిటివ్ కేసులు (మృతులు 283) నమోదు అయ్యాయి.

## ఉపాధి కూలీల ధర్నా

సిద్దిపేట,మే27(ఆర్ఎన్ఎ): చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో రోజు వారి కూలిలో అవకతవకలు జరుగుతున్నయని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ కూలీలు ధర్నాకు పాల్పడ్డారు. ఉపాధి హామీ పనుల వద్ద టెంట్, మంచి నీరు, మాస్కుల వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీ సర్పంచ్, కార్యదర్శి పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు

## తమిళనాడును వదలని కరోనా మహమ్మారి

### వలసకూలీలతో మరింతగా పెరుగుతున్న కేసులు

### ఐసిఎంఆర్ మార్గదర్శకాల మేరకు చర్యలు

చెన్నై,మే27(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర నుంచి వస్తున్న వారి రూపంలో తమిళనాట కరోనా కేసుల సంఖ్య పెరుగుతోంది. రెడ్‌జోన్ల పరిధిలో లేని జిల్లాల మీద ఈ ప్రభావం పడుతుండడంతో కేసులు అమాంతంగా పెరుగుతున్నాయి. ఏం చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా మహారాష్ట్ర వెళ్లి ముంబై నుంచి వస్తున్న వారి ద్వారానే కేసులు పెరుగడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలోనే అత్యధిక కేసులు మహారాష్ట్ర రాజధాని నగరం ముంబైలో ఉన్నాయి. ఇక్కడి నుంచి తిరుగుపయనం అవుతున్న తమిళుల రూపంలో రాష్ట్రంలో కేసుల సంఖ్య పెరుగుతోంది. ముంబై, పరిసరాల నుంచి వచ్చిన వారిలో అత్యధిక శాతం మంది వైరస్ ప్రభావానికి లోనైనట్టు పరిశోధనలో తేలింది. బయట నుంచి వస్తున్న వారి రూపంలో అమాంతంగా కేసులు పెరిగాయి. ప్రధానంగా విరుదు నగర్, తిరునల్వేలి, రామనాథపురం, తూత్తుకుడి, తేని, తిరువారూర్, దిండుగల్, పుదుకో÷-టై, మధురై, కృష్ణగిరి, ఈరోడ్ జిల్లాల్లో ఈ కేసుల్ని గుర్తిస్తున్నారు. ఈ జిల్లాలన్నీ కరోనా భారి నుంచి బయట పడి ఉన్నాయి. మళ్లీ ఇక్కడ కేసులు పెరుగు తుండడంతో రెడ్‌జోన్ల సంఖ్య పెరిగేనా అనే అనుమానం కలుగుతోంది. చెన్నైలో అత్యధికంగా కరనో కేసులు ఉన్న విషయం తెలిసిందే. ఈ నగరంతో పాటు కోయం బత్తూరు నగరం పరిధిలో అత్యధికంగా జనాభా కల్గిన ప్రాంతాల్ని ఎంపిక చేసి కరోనా పరీక్షల మీద ఐసీఎంఆర్ దృష్టి పెట్టింది. జనాభా అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో 400 మంది చొప్పున రక్తనమూనాలను సేకరించి పరిశోధనల్ని ముమ్మరం చేశారు. ప్రస్తుతం చెన్నైలో కంటోన్మెంట్ జోన్ల పరిధిలో ఐదు వేల మంది రక్తనమూనాల్ని సేకరించి పరిశోధన మీద దృష్టి పెట్టినట్టు వెల్లడించారు. లాక్‌డౌన్ నాలుగో సారి పొడిగించినా ఆంక్షల సడలింపు ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారికి కలిసి వస్తోంది. రాష్ట్రంలో 25 జిల్లాల్లో పూర్తిగా ఆంక్షలు సడలించారు. చెన్నై మినహా మిగిలిన 11 జిల్లాల్లో కొంత మేరకు సడలింపులిచ్చారు. విదేశాల్లో ఉన్న తమిళులు స్వస్థలాలకు తిరుగు పయనమవుతున్నారు. వీరి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వారిని చెన్నై వైపుగా అనుమతించడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి చెన్నైకి, చెన్నై నుంచి ఇతర రాష్ట్రాలకు ఎలాంటి ప్రత్యేక రైలు సేవలు లేవు. కోయంబత్తూరు, మదురై వైపుగా ప్రత్యేక రవాణా సేవలు కొనసాగు తున్నాయి. మహారాష్ట్ర ముంబై, ఒడిశా, కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి తమిళులు స్వస్థలాలకు చేరుకుంటున్నారు. వీరికి రైల్వేస్టేషన్లు, ఆయా జిల్లాల సరిహద్దుల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. థర్మల్ స్క్రీనింగ్, పీసీఆర్ పరీక్షలు నిర్వహించి, వైరస్ ప్రభావానికి గురికాకుండా ఉన్న వారిని వారి స్వస్థలాలకు పంపిసున్నారు. లక్షణాలు కనిపిస్తే క్వారంటైన్లకు తరలిస్తున్నారు. కొందర్ని వారి ఇళ్లల్లోనే స్వీయ నిర్బంధంలో ఉంచు తున్నారు. అయినా కరోనా కేసుల తీవ్రత మరీ తక్కువగా ఉన్న జిల్లాల్లో సైతం ప్రస్తుతం అమాంతంగా పెరుగుతుండడం కలవంలో పడేసింది. కేసుల సంఖ్య తగ్గుముఖం పడుతున్న సమయంలో కోయంబేడు మార్కెట్ రూపంలో కరనో కోరలు చాచింది. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు నుంచి విల్లుపురం, కడలూరు వరకు కోయంబేడు రూపంలో కేసులు అమాంతంగా పెరిగాయి. పక్క రాష్ట్రాలను సైతం ఈ మార్కెట్ వదలి పెట్టలేదు. రోజుకు పదుల సంఖ్యలో ఉన్న కేసులు వందల సంఖ్యలో పెరగడంలో ఈ మార్కెట్ కీలక పాత్ర పోషించింది. కోయంబేడు ప్రభావం రాష్ట్ర వ్యాప్తం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. కరోనా నిర్ధారణ పరీక్షలు ముమ్మరం చేశారు. ఈ ప్రభావం చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు శివార్లకు పరిమితమయ్యే రీతిలో కట్టడి చర్యలు తీసుకున్నారు. ఇది కొంత మేరకు ఫలితాన్నిచ్చింది.

## ప్రగతిభవన్ ముట్టడికి ఎన్ఎస్‌యూఐ యత్నం

హైదరాబాద్,మే27(ఆర్ఎన్ఎ): ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు ప్రగతిభవన్‌ను ముట్టడించారు. డిగ్రీ సెమిస్టర్ ఫీజులు రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కరోనా ప్రభావంతో తమ కుటుంబాలు ఆర్థిక సమస్యలతో ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు విద్యార్థులను అడ్డుకున్నారు. కాగా ఇప్పటికే ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి, మంత్రి సబితా ఇంద్రారెడ్డికి విద్యార్థులు విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు.

# యుద్ధానికి సిద్ధమౌతున్న చైనా

### కరోనా ముప్పును కప్పిపుచ్చుకునే ఎత్తుగడ

### భారత్ సరిహద్దుల్లో కాలుదువ్వుతున్న సైన్యం

### జిన్‌పింగ్ వ్యవహార శైలిపై సర్వత్రా అనుమానాలు

న్యూఢిల్లీ,మే27(ఆర్ఎన్ఎ): ప్రపంచంలో కరోనా వైరస్ విలయతాండం చేస్తున్న వేళ ...దాని ప్రభావం నుంచి ప్రపంచ దేశాల దృష్టి మరల్చేందుకు చైనా మరో కొత్త ఎత్తుగడలు వేస్తోంది. చైనాలో పుట్టిన కరోనా వైరస్ వలన 214 దేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. చైనాలో మొదలైన ఈ వైరస్ అక్కడి నుంచి వరసగా అన్ని దేశాలకు వ్యాపించింది. చైనాలో పుట్టిన ఈ వైరస్ పై అమెరికా ప్రభుత్వం ఇప్పటికే పలు ఆరోపణలు చేసింది. అమెరికాతో పాటుగా చాలా దేశాలు చైనాను విమర్శిస్తున్నారు. ప్రపంచదేశాలు ఎన్ని విమర్శలు చేస్తున్నా చైనా పట్టించుకోవడం లేదు. ఈ దశలో భారత్ సరిహద్దుల్లో యుద్ధ వాతావారణం సృష్టిస్తోంది.

ఇప్పటి వరకు ఇండియాకు పాకిస్తాన్‌తో మాత్రమే ముప్పు ఉండేది. నిత్యం బోర్డర్ లో పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడటంతో పాటుగా, ఉగ్రవాదులను ఇండియాలోకి చొరబడే విధంగా చేస్తూ కాశ్మీర్ లో అలజడులు సృష్టిస్తూ ఉండేది. ఇప్పుడు ఈ లిస్ట్ లో చైనా కూడా చేరిపోయింది. లడక్, సిక్కిం బోర్డర్‌లో చైనా ఆర్మీ మోహరించింది. కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నది. పదుల సంఖ్యలో ఇరు దేశాల సైనికులు బాహాబాహీగా తలపడ్డారు. గాయాలపాలయ్యారు. దీంతో లడక్ బోర్డర్ ఉద్రిక్తకరంగా మారింది. ఇండియన్ ఆర్మీ అధినేత నరవాణెలి ఇటీవలే లడక్‌కు వెళ్లి అక్కడ పరిస్థితులు సమీక్షించారు. నరవాణెలి లడక్ పర్యటన రహస్యంగా ఉండటంతో అనేక అనుమానాలకు తావునిస్తున్నాయి. మరోవైపు చైనా ఏ మాత్రం వెనకడుగు వేయకుండా ఆర్మీని మోహరిస్తోంది. పైగా చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ఆర్మీ అధికారులతో చర్చలు జరిపారు. యుద్ధానికి సిద్ధంగా ఉండేలా సైన్యాన్ని రెడీ చేయాలనీ పిలుపునిచ్చారు. దీనికంటే ముందు ఇండియా ప్రధాని మోడీ అత్యవసరంగా హైలెవల్ మీటింగ్ జరపడం కూడా అనేక అనుమానాలకు తావునిస్తోంది. జరుగుతున్నా తాజా పరిణామాలను విశ్లేషిస్తే ఇండియా, చైనా దేశాల మధ్య మరోసారి యుద్ధం తప్పదేమో అనిపిస్తోంది. చైనాపై ప్రపంచం చేస్తున్న కరోనా ఆరోపణలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రపంచం దృష్టిని మరల్చడానికి ఈ పని చేస్తుందా అన్నది సందేహంగా మారింది. మరోవైపు ప్రపంచంలో అగ్రదేశంగా పేరు తెచ్చుకోవాలి అనే ఉద్దేశ్యంతో చైనా పావులు కదుపుతున్నది. ఇప్పుడు చైనా ఆఫ్రికా దేశంపై కన్నేసింది. అక్కడి దేశాలకు సహాయ సహకారాలు అందిస్తూ పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చింది. అక్కడి అభివృద్ధి కోసం పెట్టుబడులు పెడుతూ మెల్లిగా ఆఫ్రికాలో ప్రాబల్యం పెంచుకోవడానికి సిద్ధం అవుతున్నది. ఇందులో భాగంగానే జాంబియా దేశంలో చైనా రైల్వే పరిశ్రమలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. రైల్వే ట్రాక్ లనుంచి రైల్ బోగీలను నిర్మించడం వరకు మొత్తం చైనాకు చెందిన కొన్ని కంపెనీలు జాంబియాలో పనిచేయబోతున్నాయి.

# వానకాలం పంటలకు ప్రణాళికలు రెడీ : మంత్రి జగదీష్ రెడ్డి




నల్గొండ,,మే 28 : కందులకున్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో కంది సాగుపై దృష్టి సారించాలని విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అధికారులకు సూచించారు. కందిపంటకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నందున రైతులలో ఆ దిశగా చైతన్య పర్చాలని ఆయన కోరారు. నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నియంత్రిత సాగుపై జరిగిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథి గా హాజరయ్యారు. రైతులను సంఘటిత పరచాలి అన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అని అటువంటప్పుడే పండించిన పంటకు ధర నిర్ణయించుకునే శక్తి రైతుకు లభిస్తుందని ఆయన తేల్చి చెప్పారు. ప్రయోగాత్మకంగా మొదలు పెట్టిన నియంత్రిత సాగు అంతిమంగా రైతుకు లబ్ది చేకూర్చలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అని ఆయన అన్నారు. రైతు బంధు తగ్గింపు అన్నది శుష్క ప్రచారం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. 2019 లో ఈ పథకం కింద 42,5355 మంది రైతులకు గాను 591.96 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే 3,8,1769 మంది రైతుల ఖాతాల్లో రూ. 485.59 కోట్లు జమ అయ్యాయి అన్నారు.

అయితే ఇకపై రైతు విధిగా వ్యవసాయ శాఖ అధికారి వద్ద తాను ఏ పంట వేస్తున్నాడు అన్నది నమోదు చేసుకోవాలి అని సూచించారు. నమోదు అయి కూడా రైతుబంధు పథకం అందక పోతే అధికారులు బాధ్యత వహించాలిసి ఉంటుందన్నారు. వానాకాలం పంటలకు విత్తనాలు ఎరువులు సిద్దంగా ఉన్నాయన్నారు. జిల్లాలో సాగుకు అనువైన 10 లక్షల 67 వేల318 ఎకరాల్లో వెయ్యనున్న పంటలకు సరిపడా 91,791 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. అదే విదంగా కంది పంట ను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం 2,019 కి ప్రస్తుతానికి ఏకంగా 50%శాతానికి పెంచింది. అంటే కిందటి సంవత్సరం జిల్లాలో 14351 ఎకరాల కే పరిమితం అయిన కందిని 30 వేల ఎకరాలకు పెంచడం తో పాటు అందుకు సరిపడా 1200 క్వింటాళ్ల విత్తనాలను ఆయా ప్రాంతాలకు చేర వేసినట్లు మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల నర్సింహాయ్య యాదవ్ ,యన్.భాస్కర్ రావు, చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్ కుమార్ జిల్లా కలెక్టర్ సంగీత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యం



మహబూబాబాద్ : వ్యవసాయం అంటే దండగ కాదు పండగ చేయాలని, రైతును రాజు చేయాలని సీఎం కేసీఆర్ నిత్యం ఆలోచిస్తున్నారని గిరిజన సంక్షేమ, స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్దేశించిన నియంత్రిత సాగు పై రైతులకు అవగాహన కల్పించేందుకు మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం, గౌరారం గ్రామంలో నిర్వహించిన రైతు సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాతూ రాష్ట్ర ఎండలు తీవ్రంగా ఉన్నాయి. రోహిణి రాగానే నార్లు పోసుకుంటాం.అయితే ఒకప్పుడు కరెంట్ కష్టాలతో పంటలు సరిగా పండకపోయేది. నేడు సీఎం కేసీఆర్ వల్ల ఇప్పుడు కరెంట్ పోవడమనేదే లేదు.వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్, రైతు బంధు ద్వారా పెట్టుబడి, నీటి తీరువా రద్దు చేసి పుష్కలమైన నీరు అందిస్తూ రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

ఇక్కడ కొంతమందికి రైతు బంధు రావడం లేదన్నారు. రైతు బంధు రానివారందరికి వచ్చేలా చూడాలని కలెక్టర్ కు సూచించారు. సీతారామ ప్రాజెక్టును మరింత ముందుకు తీసుకొచ్చి బయ్యారం చెరువును నింపాలని సీఎం కేసీఆర్ ని కోరానని, ఒక టీఎంసీ నీటి సామర్థ్యం తో ఈ చెరువు సామర్థ్య పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు.

సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు ప్రభుత్వం సూచించిన పంటలు ఈ వానాకాలంలో వేసి రైతులు సంతోషంగా ఉండాలన్నారు. సీతారామా ప్రాజెక్టు ను బయ్యారం వరకు తెచ్చి నీళ్ళు అందిస్తాం. కావున అధికారులు సూచించిన పంటలే వేయాలని రైతులను కోరారు.

# బాల చెలిమి బడి పిల్లల కథలు

























నేటి బాలలే రేపటి పౌరులు. భావి భారతాన్ని అందంగా ఆవిష్కరించేది బాల సాహిత్యం. నేటి పిల్లలలో నైతికత, సామాజికత, మానవత, సహృదయత, ఆధ్యాత్మికత, క్రమశిక్షణ మొదలైన సుగుణ లక్షణాలు అలవడాలంటే , వారి కల్మషం లేని మనసులను సాహిత్యం వైపు కు మరల్చాలి. అందుకు సరైన వేదిక బాల సాహిత్యం.

పూర్వ కాలంలో పిల్లలు అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యల దగ్గర వెన్నెల రాత్రుల్లో కథలు వినేవారు. నక్షత్రాలను చూసుకుంటూ పెద్దవారు చెప్పిన నీతి కథలు వినే పిల్లలు హద్దులు లేని ఆనందాన్ని అనుభవించేవారు. మారుతున్న సామాజిక మార్పుల వలన ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయాయి. చదువు , మార్కులు, ర్యాంకులు అనే మూస పద్ధతిలో పిల్లల పవిత్ర మనసులను కలుషితం చేస్తూ, వారిని మరబొమ్మలుగా మారుస్తున్నారు. బాలలను పెట్టుబడి సాధనాలుగా మార్చి, విద్యను వ్యాపార వస్తువుగా మార్చారు.

పాఠ్యపుస్తకాలు పిల్లలకు విజ్ఞానాన్ని అందిస్తే,కథల పుస్తకాలు వారిలో ఉన్న సృజనాత్మక అంశాలను, జీవన నైపుణ్యాలను అందిస్తాయి. వారిలో ఆలోచనాశక్తిని రేకెత్తించి, రేపటి సమాజంలో ఉత్తమ వ్యక్తిత్వం గల మనుషులుగా తీర్చిదిద్దుతుంది. సాహిత్యం ద్వారానే బాలలలో సంపూర్ణ వికాసం కలుగుతుందని, అందుకు వారికోసం అనేక కార్యక్రమాలు నిర్వహించడంలో సదా ముందుంటారు మణి కొండ వేదకుమార్ గారు.

రెండు తెలుగు రాష్ట్రాల సాహిత్య, పత్రికా రంగాలలో పరిచయం అక్కర్లేని పేరు మణికొండ వేదకుమార్. వీరు చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి చైర్మన్ గా ఉంటూ, దాదాపు మూడు దశాబ్దాలుగా బాల వికాసం కోసం పనిచేస్తూ "బాల చెలిమి "పత్రిక, బాల చెలిమి గ్రంథాలయాలు, ప్రతి నెల నెలా బాలచెలిమి ముచ్చట్లు నిర్వహిస్తూ బాల సాహి త్యానికి ఎనలేని సేవ చేస్తున్నారు. బాలల్లో సాహిత్యాభిలాష చిగురించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ద్వారా పిల్లలు వ్రాసిన అనేక పుస్తకాలను ముద్రించి, వారి రచనలు వెలుగులోకి తెస్తున్నారు. బాల సాహిత్య సదస్సులకు హాజరై బాల సాహిత్య రచయితలను ప్రోత్సహిస్తూ, పిల్లల్లో వ్రాయాలనే ఆసక్తిని కలిగిస్తున్నారు.

అదే క్రమంలో 2019 మార్చ్‌లో సిద్ధిపేట జిల్లా జక్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వ్రాసిన కథల పుస్తకాన్ని ఆవిష్కరించడానికి అక్కడికి వెళ్లారు. జక్కాపూర్ బడి పిల్లల పుస్తకావిష్కరణ అనంతరం వేదిక పై రాష్ట్ర వ్యాప్తంగా బాలలు వ్రాసిన కథలను పుస్తక రూపంలో తీసుకువస్తానని ప్రకటించారు. పది నెలల్లోనే పది పుస్తకాలు ముద్రించి బాల సాహిత్య ప్రపంచానికి కొండంత అండ గా నిలిచారు.

వేదకుమార్ సంకల్పానికి,బాల సాహితీవేత్త లు గరిపెల్లి అశోక్, పత్తిపాక మోహన్ లు తోడయ్యారు. తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా బడి పిల్లలు వ్రాసిన కథలను సేకరించారు. గరిపెల్లి అశోక్ రాష్ట్ర కన్వీనర్ గా ఉంటూ, వివిధ జిల్లాలోని కన్వీనర్లను సమన్వయ పరుస్తూ, ఉపాధ్యాయుల ద్వారా పిల్లలు వ్రాసిన కథలను సేకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 900 కథలు రాగా,కథల కార్యశాల లో పాల్గొన్న నిష్ణాతులైన బాల సాహిత్యవేత్తలు పలు మార్లు కథలను పరిశీలించి ఉమ్మడి పది జిల్లాల వారీగా ప్రచురణ కొరకు కథలను ఎంపిక చేశారు.

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి ఆధ్వర్యంలో మెదక్ -18, కరీంనగర్-25, నిజామాబాద్ -18,' వరంగల్-10, ఆదిలాబాద్-15, నల్గొండ-12, ఖమ్మం-18, మహబూబ్ నగర్-13, రంగారెడ్డి-13, హైదరాబాద్-21 కథలను ఎంపిక చేసి, కథలకు అనుగుణంగా ఆయా జిల్లాలకు చెందిన చిత్రకారులతో అందమైన బొమ్మలు కూడ వేయించింది. ఉమ్మడి పది జిల్లాల పేరుతోనే పది " బడి పిల్లల కథలు " సంకలనాలుగా అందమైన బొమ్మలతో, ఆకర్షణీయమైన ముఖచిత్రాలతో పుస్తకాలు రూపొందించింది . ఈ మహత్తర యజ్ఞం లో 33 జిల్లాల నుండి ఎందరో బాల సాహిత్య వేత్తలు,ఉపాధ్యాయులు, కవులు, రచయితలు, తల్లిదండ్రులు, చిత్రకారులు తమ వంతు సహకారాన్ని అందించారు.

జనవరి 29న హైదరాబాద్‌లో పది జిల్లాల బడిపిల్లల కథలను బాలల సమక్షంలో ఘనంగా ఆవిష్కరిం చారు. అనంతరం జిల్లాల వారీగా ఏ జిల్లా కథల పుస్తకాన్ని ఆ జిల్లా కు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించి, బాలలకు కొండంత ప్రేరణ కలిగించారు. కథలు వ్రాసిన ప్రతి విద్యార్థి కి పుస్తకం ఇచ్చి, ప్రశంసా పత్రంతో సత్కరించడం జరిగినది. తమ చిన్నతనంలోనే ఇంతటి గొప్ప అవకాశం పొందిన బాల రచయితల సంతోషం వర్ణించలేము.

పది జిల్లాల బడి పిల్లల కథల పుస్తకాలు రూపొందించడానికి ఆర్థిక వనరుల బాధ్యత ను వేదకుమార్ సార్ ఎంతో ఉత్సాహంగా నిర్వర్తించారు.బాల సాహిత్య వికాసం కోసం ఆయన పడే తపన ను చూసి ఎంతో మంది వారిని అనుసరించారు. రేపటి తరం కోసం మానవ వనరుల తో మహా అద్భుతాన్ని సృష్టించారు. సమయం దొరికితే వేదికలపై ఇది చేస్తాం,అది చేస్తాం అనే వారిని చూసాము. కానీ నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, త్వరితగతిన పూర్తి చేసే వారు కొందరే ఉంటారు . అందులో వేదకుమార్ సార్ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారు.

బాలల కథలే కాకుండా బాలల కోసం పెద్దలు వ్రాసిన కథలను సేకరించి ఉమ్మడి జిల్లాలవారీగా మరో 10 పుస్తకాలు ముద్రించబడి ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నవి. ఈ బాల సాహిత్య యాగం తెలంగాణ కే పరిమితము కాకూడదని ఆంధ్రప్రదేశ్ లోని బడి పిల్లల నుండి కథల సేకరణ ప్రారంభించారు. వాటిని కూడ జిల్లాల వారీగా పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు అందించే ఆలోచన లో ఉన్నారు. ప్రతి పాఠశాల గ్రంథాలయంలో ఈ పది పుస్తకాలు తప్పనిసరిగా ఉండాలి. బాల సాహిత్యంలో సంచలన నిర్ణయాలకు శ్రీకారం చుట్టిన వేదకుమార్ సార్ వలన ఇప్పటికే చాలా చైతన్యం వచ్చింది.దాదాపు చాలా పత్రికలు సాహిత్య పేజీలలో బాలల రచనలకు ప్రాధాన్యత నిస్తున్నాయి.

బాల చెలిమి గ్రంథాలయాలు స్థాపించడం, బాల చెలిమి ముచ్చట్లు నిర్వహించడం, బాల చెలిమి పత్రిక కు సంపాదకత్వం వహించడం, బాలలు వ్రాసిన కథలను ముద్రించడం లాంటి అనేకానేక కార్యక్రమాలు కేవలం బాలల కోసమే నిర్వహిస్తున్న బాలల నేస్తం, అక్షర తపస్వి వేదకుమార్ సార్ నుండి మరెన్నో సృజనాత్మక కార్యక్రమాలు పిల్లల లోకాన్ని ఆహ్లాదపరచాలని హృదయ పూర్వకంగా ఆశిస్తున్నాను.



-దుర్గమ్ భైతి
9959007914







## బాల వికాసం





### బాల గేయం
### రైతు

పొద్దు పొడుపుతోనే లేచి
ఎద్దులు నాగలి తోడను
దుఃఖాల్లో మునిగిననూ
దుక్కిదున్ను వాడు రైతు!

నాగేటి చాళ్లలోన
విత్తనాలనే చల్లి
నిలకడగా నీరు పట్టి
మొలకెత్తిన నారు నెల్ల

పొలమున వరుసగ నాటి
కలుపు దీసి రేబవలూ
కాపుకాచి పెంపుజేసి
మన తిండికి పంటలిచ్చు
మహనీయుడు రైతు!
దేశం ఆకలి తీర్చే
దైవం నిరుపేద రైతు!



- డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

### గేయము

అన్న చెల్లి మాటలు
ముత్యాల మూటలు
రతనాల తోటలు
బంగారు బాటలు
పాడినారు పాటలు
ఆడినారు ఆటలు
చూసినారు కోటలు
విన్నారు పెద్దల మాటలు
తిన్నారు సద్ది మూటలు
పంచుకున్నారు అనురాగ వాటాలు
-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## పుస్తక సమీక్ష
# బాలల మానసిక వికాసానికి దోహదం




ఉత్తమ ఉపాధ్యాయ సత్కార గ్రహీత, పలు బాల సాహిత్య ప్రోత్సాహక సంస్థల పురస్కార గ్రహీత, తెలుగు పండితులు,పఠనం, సాహిత్య గోష్ఠి, మరియు కవన ప్రవృత్తిగల సమాజ సేవానురక్తుడు శ్రీ ఉండ్రాల రాజేశంగారి బాలల కథా సంపుటి 'బాల కథా మంజూష'.

ఈ కథా సంకలనంలో 30 బాలల కథలున్నాయి. పిల్లలను అద్భుత ఊహాలోకంలోకి తీసుకుపోగల ఈ కథల్లో రాజులున్నారు. రాజ్యాలు, సేనలున్నారు. ఏనుగు,నక్క, పులి, కోతి, కందేలు, నెమళ్ళు, చిలుకలు, జింకలున్నాయి. మేకలు గొర్రెల్లాంటి సాధు జంతువులున్నాయి. బాలల్ని ఆకట్టుకునే బొమ్మలు న్నాయి. సరళమైన భాష, ప్రతి కథా బోధించే నీతి ఉంది. నింగిలో కొన్ని ప్రముఖ పత్రికల్లో లోగడ ప్రచురించబడి పలువురి మన్ననలు పొందాయి.

సంకలనంలోని కథలను రెండు విభాగాలుగా విభజించవచ్చును. ఒకటిపిల్లలు తమ తోటి పిల్లలతో ఎలా మెలగాలి. పెద్దలు మరియు గురువుల యెడ ఎలా ప్రవర్తించాలో తెలుపుతాయి. రెండవది: బాద్యతగల పౌరులు మరియు పిల్లలు, ప్రకృతి యెడ సాధక భావంతో ఉంటే ప్రకృతి,జంతువులకు, మనుష్యులకు మేలు అని ప్రభోధిస్తూ పిల్లల్లో సమాజం పట్ల ఉండవలసిన బాధ్యతను గుర్తుకు చేస్తాయి. ప్రకృతిని రక్షించక విస్మరిస్తే విపరీత పరిణామాలను పిల్లల మనసుల్లో నాటుకునే రకంగా చెబుతాయి. (ఉదా॥ ప్రకృతి-రక్షణ) ఐక మత్యమే బలం అని 'అధ్యక్షులు' కథ చెబుతుంది.

అరటిపండు బలిచి చేతబెట్టినట్లున్న ఈ బాల కథల రచయిత కథ, వస్తువు ఈరెంటి సంవిధానం-వీటన్నింటినీ పిల్లలకు అర్థమయ్యే భాషలో చెప్పారు. "కోపోద్రిక్తుడై నాడు (పే.32, పండ్ల చెట్లు) వంటి కఠిన పదాలను వాడకుండా ఉంటే ఇంకా బావుండేది.

రచయిత ఉండ్రాల రాజేశం తన కథా 'మంజూష'ను తెరిచి, 30 రత్నాల్లాంటి కథలను మందహాసంతో బాల పాఠకులకు అందిస్తున్నాడు. బాల పాఠకులు అంతే ఆనందంతో ఈ మందసంలోని కథలను అందుకోవాలి. ఆచరించాలి.

ప్రతులకు: 9966946084



-కూర చిదంబరం
సెల్: 8639338675

## కరోనా మీద కవిత్వం...

ఏమిటి.. కరోనా మీద కవిత్వమా?
'కోవిదు' మీద భావనా 'కోవిదు'ల పద్యాభిషేకమా?
ఏ హిరణ్య కశ్యపుని మీదనో, ఏ రావణాసురుడి మీదనో
ఏ దుష్ట రాక్షసుడి మీదనో కవిత్వం చెప్పమంటే చెబుతాం
కానీ..అంతకన్నా కోటాను కోట్ల దుశ్చింతనతో
నరజాతి నాశనమే లక్ష్యంగా పెట్టుకున్న 'కరోనా'
మీద కవిత్వమా...

పంచశీలను తుంగలో తొక్కి మన శత్రువునే
ప్రేమించి మనకు పక్కల్లో బల్లెం అయిన డ్రాగాన్
మనో వ్యూహంలో రూపుదిద్దుకొని, టెస్టుట్యూబుల్లో
పురుడు పోసుకున్న జీవాయుధం కరోనా మీద కవిత్వమా?

'ఎవరు బయట దొరుకుతారా కాల్చుకుతిందాం'
అంటూ అన్ని చోట్లా విహరిస్తూ, అందరినీ "గృహ
నిర్భంధం"లో ఉంచిన కరోనా మీద కవనమా?
210కిపైగా దేశాల్లో 57 లక్షల మందిని పీడించి
3 లక్షల యాభై వేలకుపైగా మందిని బలి తీసుకున్న
మారణ పిశాచి కరోనా
'అమ్మా అయ్య'కు పుట్టని అక్రమ సంతానపు ఘోర
కర్కోట పైశాచిక దుర్విక్రమత కరోనా...
బడీ లేదు.. గుడీ లేదు.. ఉద్యోగమూ లేదు..
వ్యాపారమూ లేదు.. రైలూ లేదు.. బస్సూ లేదు
చివరికి కప్పెడు చాయికి కూడా నోచుకోని
నికృష్టపు సన్నివేశంలో 'శాడీజం'తో
చిందులు వేస్తున్నది కరోనా
అదేమిటో..అయిపుట్టిన ప్రతి వికారానికీ
మానవ జాతిని మట్టుపెట్టడమే లక్ష్యం
ప్లేగు..క్షయ.. ఎయిడ్స్, కలరా, కాన్సరు, ఐలా, లైలా..డెంగ్యూ
చికెన్ గునియా.. ఇప్పుడు కరోనా!!
అయితే ఇందులో స్వార్థపరులై ప్రకృతి మాతను
అల్ల కల్లోలం చేసిన దుష్టుల తప్పిదమూ ఉందిలే!
కొందరి స్వార్థానికి, నరజాతినే బలిపీఠం మీద నిలుపుతారా
దుర్మార్గానికే అంత బలం ఉంటే
మంచి తనానికి ఉండదా..ఉన్నది..ఉంటుంది.
ఇంకా..మానవ మేధస్సు ఇంకిపోలేదు మిత్రమా!
'కొండ అద్దమందు కొంచెమై' ఉన్నట్లు
తాత్కాలికంగా తలవంచుతున్నది జాతి!
గతంలో ఎన్నిసార్లు నరుడు విజయం పొందలేదు?
ఇప్పుడూ అంతే.. కొంచెం ఓపిక...
త్వరలో విరుగుడు వాక్సిన్‌తో కరోనాను జయిద్దాం!
మానవ కల్యాణానికే అంతిమ విజయమని చాటిద్దాం!!
మానవ జాతి మీద మంచి కవిత్వం రాద్దాం!!
- డా॥ రాధశ్రీ
సెల్: 9494481210

### ప్రేమగుడి

ఎన్ని నోముల మొక్కుబడో
నేను భారమైనా.....
నన్ను ఆనందంగా మోసింది అమ్మ

మాతృభాషలో మచ్చలేని
మధుకరమైన పదాలు అమ్మ

అమ్మ ప్రేమ
అంతులేని ఆత్మీయతతో
అనుదినం ఉప్పొంగే అనురాగ గంగ

అమ్మ ప్రేమ
అంతం లేని ఆప్యాయతతో
అనుక్షణం పొంగే మమతల గంగ

అమ్మ పలుకులు
ఆత్మీయ పరుగుల నడకలు
చిరు చినుకుల నడుమ
సుందరమైన హరివిల్లు

సృష్టిని
నడిపించేది దైవమైతే

పుడమిపై
విరిసిన కమ్మదనం
నా హృదయ
స్పందన మా అమ్మా......

-సాయి వర్షిత్,
10 పదవ తరగతి,
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,
నారాయణ ఖేడ్, సంగారెడ్డి జిల్లా.

### చమ్కీలు

గుట్టలోని బండలు
శిల్పి చేతికి చిక్కి నాయి
ఉలి దెబ్బలు తిని
శిల్పా లైనాయి
కష్టం ఓర్చుకుంటే
సుఖం లభిస్తుంది

బడి ఈడు పిల్లలందరూ
బడి కౌగిట చేరారు
గురువుల బోధనలు విని
విద్యావంతులైన నారు

గురువు లేని విద్య
గుడ్డి విద్య

విష్ణుమూర్తి అడిగితే బలి చక్రవర్తి
ఇచ్చెను మూడు అడుగుల నేల
గురువు చెప్పిన వినలేదు మాట
ప్రాణం కన్న దానం మిన్న అన్నాడు
మాటతప్పని బలి చక్రవర్తి
విశ్వానికి ఆదర్శమూర్తి
-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

### కోయిలమ్మ రాగాలు

మంచిని పెంచు
ప్రేమను పంచు
కీడును తుంచు
ఓ కోయిలమ్మ !

నిజం నిప్పు
అబద్ధం తప్పు
మోసం ముప్పు
ఓ కోయిలమ్మ!

రోషం కీడు
ద్వేషం వీడు
విజ్ఞత రేడు
ఓ కోయిలమ్మ !

ఓటుకు నోటు
బ్రతుకుకు కాటు
భవితకు చేటు
ఓ కోయిలమ్మ !



- కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

### బాల్యం

ఆనందపుటంచులు తాకే బాల్యం ఎక్కడ ఉందీ
ఆహ్లాదపుటవధులు దాటే బాల్యం ఎక్కడ ఉందీ
టైరు పంక్చరు షాపుల్లోనా బాల్యం బందీ
చాయపోసే హోటల్లోనా బాల్యం బందీ
కూరలమ్మే అంగడిలోనా బాల్యం బందీ
చెత్త కుప్పలు ఏరుటలోనా బాల్యం బందీ
బిచ్చమెత్తే బతుకుల్లోనా బాల్యం బందీ
ఇచ్చగించని పనుల్లోనా బాల్యం బందీ
పలక పట్టే చేతులు అరక పడితే ఎలా?
బలపం పట్టే చేతులు బరువులెత్తితే ఎలా?
ఆడి పాడే మనసులు ఆరళ్ళ పాలైతే ఎలా?
ఊహలఊయల ఊగే వయసులో
ఊపిరి సలపని పనులేలా?
కమ్మని కథలు వినాల్సిన తరుణంలో
కష్టాల కడలిని ఈదనేలా?
బాలల జీవనచిత్రం మారాలంటే..
బాల్యం ఛిద్రం కారాదంటే..
బాలలు బడిబాట పట్టాలిపుడు
వారి భవితకు భరోసానివ్వాలిపుడు.
అరకపట్టే చేతులకు పలకనిచ్చే దాత కావాలిపుడు
బరువులెత్తే చేతుల్లో బలపంపెట్టే భ్రాత రావాలిపుడు
ఆరళ్ల పాలైన పావలను ఆడిపాడించే దోస్తు కావాలిపుడు
వెట్టినుండి విముక్తికోసం
ఆ చిట్టిచేతులకు గట్టి ఆసర కావాలిపుడు
పనుల్తో ఊపిరాడని పిల్లలను
ఊహల ఊయలలూపే జోడి కావాలిపుడు
కష్టాల కడలి వదలలేలా
కమ్మనికథలుచెప్పే బామ్మ కావాలిపుడు
పలకనిచ్చే దాత.. బలపమిచ్చే భ్రాత..
ఆడిపాడే దోస్తు.. ఊయలలూపే జోడీ..
కథలు చెప్పే బామ్మ..
అందరూ ఒక్కటై గురువుగా రావాలిపుడు..
అపుడే బాల్యం ...
ఆహ్లాదపుటవధులు దాటుతుంది
ఆనందపుటంచులు తాకుతుంది.



-రాంనరేష్
9492682285

### నేటి నిజాలు

ఆ గొంతులో మత్తుగా దిగుతున్న చెమటచుక్కలు
రంగులు మార్చుకుని లోకాన్ని మరిచాయి
భుజంపై మోస్తున్న ఉదయాన్ని
మండుటెండలో తాకట్టు పెట్టి
సాయంత్రాన్ని దొరి మళ్ళించిన నీవు
నీకు నీవే చీకట్లో కలిసిపోతున్నావు
కాటువేస్తున్న కాలాన్ని రంగునీళ్లలో ముంచి
మూడుముళ్ళ బంధానికి దుఃఖాన్ని పంచి
అగాధలోయల్లోకి జారిపోతున్నావు

నీ చుట్టూ ఆవరించిన కారుమబ్బుల్లో
నీవు శ్రామిక సూర్యుడిగా ఉదయించి
వెలుగును పంచుతూ.. పేదరికాన్ని జయించాలి..!

- కెరె జగదీష్














## నానీలు

రచన
సృజనాత్మకం
పుస్తకం
విజ్ఞానం

సామెత
అనుభవం
సోంతవాక్యం
కల్పితం

బడి
గురువు
మైదానం
ఆట

మనస్సు
హృదయం
శరీరం
స్పర్శ

హృదయం
శరీరం
పెళ్ళి
జీవితం

మస్తిష్కం
జ్ఞాపకం
హృదయం
తపన

కరోనా
రోగం
దీపం
వెలుగు

వెన్నెల
వెలుతురు
చీకటి
నిద్ర



–చాపల
మహేందర్
9949864152

## యుద్ధానికిలా సిద్ధం కా....

యుద్ధం మొదలైంది
సిద్ధం కావటం నేర్చుకో
బలం కాదు
బాధ్యత పెంచుకో

ఆయుధాలు పడేసి
అలవాట్లు మార్చుకో
అణువాయుధాలు వదిలి
ప్రాణవాయువు పెంచుకో

పగ, ద్వేశం
పనికిరాని అస్త్రాలు
ప్రేమ ,అనురాగం
బ్రహ్మాస్త్రమని తెలుసుకో

కాలుష్యం పెరగకుండ
యంత్రాలను వాడుకో
పనిముట్లతొ వ్యవసాయపు
విజ్ఞానము పెంచుకో

సహజత్వం వీడకుండ
ఆరోగ్యము పెంచుకో
శత్రువు ఏ రూపమైన
తరిమికొట్టి మేలుకో

పాత తరం మాటలన్ని
బహుమతిగా తీసుకో
భవిష్యత్తు నీ సొత్తు
శుభ్రతనే పెంచుకో

యుద్ధమెప్పుడైన కాని
సిద్ధమై ఎదురుకో
తోటివారి మేలుకొరకు
నిన్ను నీవు మార్చుకో



బి.సుధాకర్
9849243908

## కరోనా లేఖ

ఓ మనిషీ ,
భూమాత గుసగుస లాడింది
నువ్వు వినిపించుకొనలేదు
భూమాత నెమ్మదిగా చెప్పింది
నువ్వు వినలేదు
భూమాత ఎలుగెత్తి అరిచింది
నువ్వు పట్టించుకోలేదు
అందుకే నేను వచ్చాను
నిన్ను శిక్షించటానికి కాదు
నిన్ను మేల్కొలపడానికి.

విషవాయువులతో ఊపిరాడక
అగ్నిగుండాలతో జ్వలించి
వరదలతో కొట్టుకుపోతో
సుడిగుండాలతో సతమతమై
కనికరించమని భూమాత అర్థించినపుడు
నువ్వు పెడచెవిన పెట్టేవు
అందుకే నేను వచ్చాను
నిన్ను శిక్షించటానికి కాదు
నిన్ను మేల్కొలపడానికి.

వన సంపద కనుమరుగౌతుంటే
వన్య మృగాలు అంతరించుతుంటే
జీవ నదులు ఎండిపోతుంటే
పంటపొలాలు బీడు భూములవుతుంటే
చరవాణి వికిరణ వల్ల పక్షులు
విగతజీవులవుతుంటే
భూమాత హెచ్చరించినా
నువ్వు పట్టించుకోలేదు
అందుకే నేను వచ్చాను
నిన్ను శిక్షించటానికి కాదు
నిన్ను మేల్కొలపడానికి.

నిన్ను నాలుగు గోడల మధ్య
బందీని చేశాను
భౌతిక సుఖాలనుండి
దూరం చేశాను
నిన్ను బలహీన పరిచాను
నిన్ను బానిసని చేసుకున్నాను
ఓ మనిషీ ! ఇకనైనా మేలుకో
నీ బాధ్యతను తెలుసుకో.

వన సంపదని పెంపొందించు
వన్య మృగాలను సంరక్షించు
పర్యావరణాన్ని పరిరక్షించు
కాలుష్యాన్ని నియంత్రించు
సకల జీవులని ప్రేమించు
మానవత్వాన్ని పెంచు

మానవ జీవన శైలి మారకపోతే
మళ్లీ నేను వస్తాను, ఉధృతమై,
ఉప్పెనై, విలయ తాండవం చేయ
నీ పాలిట మృత్యుదేవతగా.



–కందాళం రజనీకృష్ణ

## ఎప్పుడైనా వుందా?

ఎప్పుడైనా వుందా?
దేశాలకు దేశాలు
నగరాలకు నగరాలు
ఊర్లకు ఊర్లకు
లాక్ డౌన్ ప్రకటించుకుని
ఒంటరి దీవుల్లా మారిపోవటం

ఎప్పుడైనా వుందా?
మనుషులందరూ కుటుంబాలుగా
గడపలోపలే గుమిగూడి
కోల్పోయిన బతుకు క్షణాలను
మనసారా నెలల కొద్దీ
పోగేసుకోగలగటం

ఎప్పుడైనా వుందా?
మానవ సమాజమంతా మూకుమ్మడిగా
భౌతిక దూరాన్ని పాటిస్తూ
మానసికంగా ఐకమత్యాన్ని
చాటుకునేంత దగ్గరగా మసలటం

ఎప్పుడైనా వుందా?
ప్రపంచమే ఒక జైలు గదిలా మారిపోయి
అగ్ర రాజ్యాలే గజగజా వణికిపోతుంటే
ప్రపంచ పటంలో నలుసంత లేని దేశాలు
నడుం కట్టి నలుగురికి సేవ చేసే
గొప్ప భాగ్యానికి శ్రీకారం చుట్టటం

ఎప్పుడైనా వుందా?
కులాలకతీతంగా, మతాలకతీతంగా
ప్రాంతాలకతీతంగా, దేశాలకతీతంగా
మానవులంతా ఏకమై
కనిపించని శత్రువునెదుర్కునేందుకు
కలిసికట్టుగా యుద్ధం చేయటం

ఎప్పుడైనా వుందా?
లేదు, ఇప్పుడే వుంది

కనిపించని శత్రువును మట్టి కరిపించేందుకు
మానవజాతినే గడ గడలాడిస్తున్న
ఈ మహమ్మారిని తుదముట్టించేందుకు
మనుషులందరూ ఏకమై
పరిశుభ్రతే ఆయుధమై
భౌతిక దూరమే సాయుధమై
ఒక మహా యుద్ధాన్ని
ప్రకటించాల్సిన అవసరమూ
ఇప్పుడే వుంది!



– చిత్తలూరి
8247432521

## కరోనా హెచ్చరిక

మీ మీ దూరాన్ని ఎడబాటు చేసి
ఖాళీ రోడ్లన్నీ చుట్టేశా
దుకాణాలన్నీ మూసి ఉన్నా
అత్యాశతో బయటకు వస్తారని ఆశ

నేను మీ దగ్గరికి చేరడానికి నా ప్రయత్నాలు ఎన్నెన్నో
నా ఆత్రుత వైద్యశాలలో ప్రవేశ కోసం
రకరకాల మందులకు భయపడకుండా
గేటు ముందు తిష్ట వేసి లోపలికి ప్రవేశిస్తా

మీరిచ్చిన ఉదయకాల సమయంలో
కూర గాయల బజారులలో
ఇతరత్రా దుకాణాలలో
గుంపులు గుంపులుగా వచ్చే వెర్రి జనం కోసం
నేను అడ్డంగా నిలబడే ఉంటా

నాకు సోకదులే అనుకునే వెర్రిబాగులోడి కోసం
నా విశాల హృదయ కౌగిట్లో
మీ మృతదేహాలను పదిల పరుచుకుంటా
త్వరగా రండి చావును పరిచయం చేస్తా
నీ రాకకై నా నిరీక్షణ
మీ జాగ్రత్తలో మీరుంటే నా జాగ్రత్తలో నేనుంటా

–దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు
సెల్ : 94930 33534

## కరోనాను పాతరేద్దాం..!

ముఖముతాకలేము:ముచ్చట్లు మరిలేవు
సూక్ష్మజీవి వల్ల:సుద్దులేవి?
మూడడగులయెడము:మురిపెమే సౌఖ్యమ్ము
శ్రీనివాసుమాట:సిరులబాట!
కరోనాను పాతరేద్దాం..!

కనులునలుపరాదు:కడుశుభ్రతనులేక
నోటియందు వ్రేలు:నెట్టవలదు
సాకులెన్నొజెప్పి:సడకుపైతిరుగకు
శ్రీనివాసుమాట:సిరులబాట!

చైననుండిరేగి:చెలగికరోనాయు
ప్రాణములనుదీయు:పాతకిలను
విశ్వమంతతిరిగి:విస్తృతమాయెను
శ్రీనివాసుమాట:సిరులబాట!

నీదుదొంగదెబ్బ:నిలువునాజంపఁగ
చచ్చిపడినవారి:సంగతేమి?
కనులకనగరాని:కాఠిన్యపుకరోనా?
శ్రీనివాసుమాట:సిరులబాట!

ఇందుసందులేక:ఇమిడిప్రాణముదీయ
శాస్త్రవేత్తలంత:శత్రువనిరి
శుచిగచేతులుకడిగి: శుభ్రతపాటించు
శ్రీనివాసుమాట:సిరులబాట!

తుమ్ముతీకుతీపి:తుంపరతిండియు
జలుబుదగ్గుకఫము:చలువకోరు!
అంటువ్యాధివీవు:అందఱకువిరోధి
శ్రీనివాసుమాట:సిరులబాట!

పేదధనికలేదు:పెట్టేవురోగాలు
కొవ్వుగొలుసుబలుపు:కోరెజీవి!
వైద్యమూర్తులిలను:వెరవకనణచేరు
శ్రీనివాసుమాట:సిరులబాట!

నర్సులిలనుసేవ:నయముతో జేసేరు
పారిశుద్ధపనులు:పరగ జేయ
రక్ష! భటులుమనకు:రాత్రిపగలు జూడ
శ్రీనివాసుమాట:సిరులబాట!

లక్షలాదిప్రజల:లాగించితింటివి
నీతిలేనిదాన:నియతిలేదె!
లాకుడౌనుమనకు:లక్ష్మణరేఖయే!
శ్రీనివాసుమాట:సిరులబాట!

చేయికల్పకున్న:చెడదురా స్నే హమ్ము
నతులుసత్యమనియు:నమ్ముకున్న
కాళ్ళునింటనున్న:కలగుసుఖములన్ని
శ్రీనివాసుమాట:సిరులబాట!

తిరిగిపో కరోన:తిక్కరాక్షసివీవు
మరల మరలరాకు:మళ్లినీవు
వద్దువద్దునీకు:వడ్డెనవాతలే!
శ్రీనివాసుమాట:సిరులబాట!

కులముమతములేదు:కుటిలకరోనాకు
నాకిజంపుగుణము:నయముగాను
పాపిబుద్ధిదాన:పాతరవేద్దుము
శ్రీనివాసుమాట:సిరులబాట!



–డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493,



## క్యాంపస్ కలవరం

అమ్మలాంటి ఆర్ట్స్ కాలేజ్
నలుదిక్కుల కన్నులతో
తన బిడ్డల కోసం
ఎదురుచూస్తున్నది.
నిజాం రాజరికాన్ని తలపించే
ప్రవేశద్వారం మూసుకొని ఎన్నాళ్ళయింది.
ఎందరో జ్యోతిర్మంతులను
జగతిలోకి పంపిన ద్వారమది.
జగమంత కుటుంబాన్ని
తన ఒడిలో పొదిగి
విజ్ఞాన వీధుల్లో ఉదయించిన
ఎర్రని రాతి సూర్యబింబమది.
నేడు కరోనాంధకారంలో
సడిలేని శూన్యంలో
ఒక్కతే
తన వాళ్ళ క్షేమం కోరుతూ
దిగంతాల దైన్యాన్ని ప్రశ్నిస్తూ
వెచ్చని జ్ఞానోశస్సును
గుండెల్లో దాచుకొని
నిబ్బరంగా నిలుచుంది.

జగత్ప్రళయాన్ని తలపిస్తున్న
అనంత దుఃఖం
రోడ్లను కమ్మేసింది.
రోడ్ల నల్లరంగును అద్దుకున్న
కన్నీటిచుక్క
చారిత్రక భవనాలను
దుఃఖంతో తడిపేస్తుంది.
పిల్లల ఎడబాటుతో
పచ్చిబాలింతల్లా కాలేజీలు
దుఃఖిస్తున్నాయి.
ఎన్నాళ్లీ విషాద ఘంటికలు
ఎందుకీ కరోనా కార్పణ్యం
తప్పెవరిది? మాదా? అంటూ
కాలేజీలు ఉద్యమిస్తున్నాయి.

నందనవనం లాంటి
ల్యాండ్ స్కేప్ ఆత్మ
ఈ భీభత్సాన్ని తలుచుకొని
రోజు వచ్చే విద్యార్థి
రీడింగ్ చైర్లో
కూలబడి ఏడుస్తోంది.
హాస్టళ్లలో అమృతం దొరికి
ఎన్నిరోజులైందో.
ఆకలితో వచ్చే అన్నార్థుల
కడుపులు నింపి ఎన్నాళ్ళైందో.

లైబ్రరీ కుర్చీలు ఖాళీగా
పుస్తకాల షెల్ఫ్ ల వైపు
దిక్కుతోచక
దీనంగా చూస్తున్నాయి.
ఎప్పుడొస్తారో
నా పరిశోధక బిడ్డలు.
ఎన్నడొస్తుందో మాకు
మళ్ళీ అధ్యయన వసంతం
అంటూ అక్షరాల కళ్ళతో
తపస్సుచేస్తున్నాయి.
కరోనా కార్ముకం పట్టుకొని
బాణాలు విడుస్తోంది.
రోజు రోజుకు
క్షతగాత్రుల వేదన వార్తలతో
క్యాంపస్ తల్లి తల్లడిల్లుతోంది.
అమాయకంగా విహరించే
పావురాళ్లు
మెతుకు దొరకక
నేలరాలుతున్నాయి.

డిపార్ట్మెంట్ లన్నీ
డీప్ డిప్రెషన్ లోకెళ్ళాయి.
క్లాస్ రూములు కలవరపడుతున్నాయి
కిటికీల్లోంచి వీస్తున్న గాలుల్లోని
సంవేదనను వింటున్నాయి.
ప్రయోగశాలల్లోని
సైన్స్ మిణుగురులు
లాక్ డౌన్ చీకటిలో దారితప్పి
ముళ్ల పొదల్లో ఇరుక్కున్నాయి.

క్రీడాస్థలాల్లోని ఇసుక
ఎండల్లో మండిపోతూ
ఎడారిని తలపిస్తోంది.
మస్తిష్కాలను మధించే
మీడియా పాయింట్
విద్యార్థి ఉద్యమకారుల
ధిక్కార స్వరాలకు దూరమై
నిశ్శబ్దాన్ని మోస్తున్నది.
కాలాన్ని కంపింపజేసిన క్యాంపస్
కలవరంతో గతాన్ని
నెమరేసుకుంటుంది.

ఉద్యమాలు పుట్టిన నేల
లాక్ డౌన్ ఉద్యమంలో
భాగమైంది.
జ్ఞాపకాలతో
యద బరువెక్కుతోంది.
కలల క్యాంపస్ లోకి
మళ్ళీ వెళ్లిపోవాలనుంది.
విజయ ద్వారాలను తెరవాలనుంది.

–మంత్రి శ్రీనివాస్

## స్టే ఎట్ హోం

ఎడంఎడంపాటించు
నట్టింట్లోనేవుండు
నమ్మకాన్ని వమ్ముచేయకు
స్టే ఎట్ హోమ్..
సోషల్ డిస్టెన్స్ సేఫ్
శుచి శుభ్రత పాటించు
కరోనానుతొలగించు

నూరేళ్ళూ జీవించు
కరోనాసే మత్ ఢర్ నా
ధైర్యసాహసే జీవితం
కరచాలనమికవద్దు
చేతుల జోడింపే ముద్దు
వందనమొక సంస్కారం
దండం మన సంస్కృతి.

– ముప్పవరం ప్రభాకర్ రావు
9505312441

## మళ్లీ పల్లె ఒడిలోకి.....

నేనొక కలగన్నాను...

నిన్నటిదాకా
పిల్లలు లేక వెలవెలబోయిన
నాబడి
ఈరోజు తామరతంపరగా
అడ్మిషన్ల కోసం క్యూ కట్టిన
సందడి

ప్రైవేటు బస్సులెక్కి
డాలర్ల కలలను సంచి నిండా నింపుకొని
పట్నం చదువుకోసం పోయిన బాల్యం
తిరిగి నా బడిని ఆశ్రయిస్తుంది

నవోదయ గురుకుల పరీక్ష లంటూ
దూరపు కొండలు నునుపు అని
పల్లెను వదిలి పట్నం దారి పట్టిన తల్లిదండ్రుల ఆశలు
తిరిగి సొంత గూటికి చేరుకుంటున్నాయి

కరోనా పుణ్యమా అని
కలో గంజో తాగి పల్లెలోనే బతకాలని
ఎండమావి ఆశలకు పోయి
జీవితాలను పణంగా పెట్టలేమని
మా పిల్లలు ఈ బడి లోనే చదువుతారు
చేర్చుకోండి సార్ అని
తల్లిదండ్రుల అభ్యర్థనలు
నా చెవులకింపుగా వినిపిస్తున్నాయి
కలలో కరోనా వల్ల బడికి కళ వచ్చింది
పూర్వవైభవం వచ్చినందుకు ఒళ్ళు పులకరించింది
ప్చ్...
అంతలోనే మెలుకువ
ఎంతటి మధురమైన కల
నిజంగానే నా కల సాకారం కానుందా...

గో బ్యాక్ టూ నేచర్....
నేను తరగతి గదిలో చెప్పిన రూసో పాఠం
చెవులలో గింగురు మంటోంది
సాంకేతికత రెక్కలు కట్టుకుని
భూగోళమంతా ఎగిరి వచ్చిన మనిషి
చెదిరిపోయిన కలల శకలాలను ఏరుకుని
సొంత గూటికి చేరుకోవాలని ఆశపడుతున్నడు
ఆస్తిపాస్తుల కన్నా
ఆత్మీయ తల పట్ల మొగ్గు చూపుతున్నడు
నా కల నిజమయ్యే రోజు
మరెంత దూరంలోనో లేదు



– సాగర్ల సత్తయ్య
7989117415

## ఓ కరోనా నీకు వందనం

కరోనా నీకు వందనం..
పరదేశి వి అయినా ...
భారత మాత ఆత్మీయత కి
లొంగిపోయినట్లు ఉన్నావ్...
ఇక్కడే తిష్ట వేసుకుని ఉన్నావు...
అయినా నీకు వందనం..
నీతో పాటు...
మాతృ దేశాన్ని... కన్న తలితండ్రులను..
మర్చిపోయి... తమ స్వార్థ జీవితాల్లో...
బంధాలను ..అనుబంధాలను...
ఆత్మీయత... అనురాగాల ను..
మర్చిపోయి... తమకంటూ...
ఒక ప్రత్యేక లోకాన్ని ..
ఏర్పాటు చేసుకొని...
నవ మాసాలు మోసిన వాళ్ళకి..
నాలుగు మాటలు మాట్లాడే...
సమయం లేక...
ఎప్పుడో వీలు కుదిరినప్పుడు...
వీడియో కాల్...
అది కూడా కొన్ని నిమిషాలు మాత్రమే...
గోరు ముద్దలు తినిపించిన “అమ్మ”..
భుజాలు మీద తిప్పిన “నాన్న” ల కి...
ఆరోగ్యం బాగోలేక కబురు పంపితే...
ఖాళీ లేదని... డబ్బులు పంపి..
పాతికేళ్ల ప్రేమ కి ఖరీదు కట్టి..
చేయి దులుపేసుకున్న ..
మహానుభావులు అందరికి...
ఒకేసారి...
భారత మాత మీద ప్రేమ పుట్టుకొచ్చింది...
బ్రతకడానికి పనికి రాని బంధం...
చావు గుర్తుకు రాగానే ...
మమతలు తలంపుకి వచ్చాయి ఏమో??
అయినా ఈ పిచ్చి తల్లికి ఆనందమే...
బిడ్డలు మీద ప్రేమ లేని తల్లి ఉంటుందా??
మందే లేని రోగం తో వచ్చే బిడ్డలని చూసి...
నేనున్న నేనున్నా అంటూ...
తన గుండెలపై ఆక్కున చేర్చుకున్న .
ఓ తల్లి నీకు జోహార్లు...
ఇది నీ వల్లే “ ఓ కరోనా”
యమ పాశం లా అందరినీ వెంటాడుతుంటే.
గత స్మృతులను మనసారా నింపుకోవాలి అని..
ఉన్న ఊరు.. కన్న వారు ...
కన్న గొప్ప సంపాదన లేదని..
'జననీ, జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'
సత్యం తెలుసుకునేలా చేసిన నీకు వందనం...

– వజ్రాల .ప్రియాంక
9948523883

**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని 5 సం॥రాలకు రూ.700/–, 10 సం॥రాలకు రూ 1200/– మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు. లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660
Gandhi Nagar Branch Hyderabad-80 అకౌంట్‌లో వేయవచ్చును.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి–74,
జవహర్‌నగర్,
హైదరాబాద్–500 020.

## భయపెడుతోంది

ఈ నిరామయ ఏకాంతం భయపెడుతోంది.
అస్థిత్వాన్ని ఎక్కడో వదులుకొని
పురిటి నొప్పుల పరమ హింసతో
విధ్వంస చిహ్నాల్లా మనుషులు.
నిరంతరం కళ్ళలో ప్రశ్నల్ని ధరించి
కరిగించే విషాదంతో
వర్తమాన ఉద్వేగాల మీద దాడి చేస్తున్న
ఈ క్రిమి వెకిలి నవ్వుని
కనురెప్పలై పహారా కాస్తూ
విషాదానంద బాష్పాల్ని రాలుస్తున్నారు.
ఒక కంటికి కనబడని జీవి
కళల కౌగిళ్ళని ఉక్కిరి బిక్కిరి చేసింది.
వేయి వసంతాలను ఛిద్రం చేసింది.
ఆశల శవాల్ని ముక్కల్లా ఏరుకోమంది...!
ఎన్నెన్ని నా కలలు కాలిపోతున్నాయో నీకేం తెలుసు...!
మా గుండెల్లో ఎన్ని సముద్రాలు ఆడుకుంటున్నా
యుద్ధం మాత్రం నీతోనే...!



–ఏటూరి నాగేంద్రరావు
7416665323

## గడపదాటని సైనికులు

కరోనా నువ్వు కూడా...
అయినా మమ్మల్నెవరు
ప్రశాంత నదుల్లా ప్రవహించనిచ్చారనీ
మా యవ్వనాల ప్రేమనెప్పుడు
గుండె గేట్లు తీసి స్వాగతించారనీ

మా ఆశలు కలబోసుకోకుండా
మా ఊసులు పెనవేసుకోకుండా
మా హృదయాలను అర్థం చేసుకోకుండా
ప్రేమంటేనే వెలి వేస్తున్న సమాజమిది
ప్రేమికులను చంపి పాతరేస్తున్న దాష్టీకమిది

కులం పేరు చెప్పో మతం దారి తప్పో
మా నడుమ ముళ్ల కంచెలు నాటుతూనే వున్నారు
అంతరాల సరిహద్దులు గీస్తూనే వున్నారు
మా ప్రేమ కెప్పుడూ వెలి సంకెళ్లు వేస్తూనే వున్నారు
బెదురు చూపుల కళ్లతో, వణుకు పుట్టే దేహాలతో
ప్రేమ పావురాలమై మాదైన కలల ప్రపంచంలో
మేము స్వేచ్ఛగా విహరించిందెప్పుడని

మా చుట్టెపుడూ ఒక అభద్రతా వలయం
మా ఉనికి చుట్టూ ఒక డేగకళ్ల నిఘా నిలయం
రోజూ మమ్మల్ని దూరం పెట్టే పథక రచనలే తప్ప
మమ్మల్ని దగ్గర చేసే ప్రేమ వంతెనలెక్కడివి
అనేక దూర భారాల వియోగాల మధ్య
తీయని మా కలల సంగమాలొక మిధ్య
మేమిప్పటికీ విడిపోతున్న జంట పక్షులమే
కలుసుకోలేని రైలుపట్టాలమే

ఇన్ని రకాల మా విడదీతల జాబితాలో కరోనా
ఇప్పుడు నువ్వు కూడా కొత్తగా చేరి
మా ఉసురు తీస్తున్నావు
పార్కులూ, పబ్బులూ
విహార ప్రదేశాలు, వినోద ప్రాసాదాలు
చివరికి మా ఊహలు కూడా లాకౌటు ప్రకటించాయి
భౌతిక దూరాలంటూ మా మధ్య
మరింత దూరాన్ని పెంచాయి
ఈ మానవ చరిత్రలో
మా ప్రేమ కథలెప్పుడు సుఖాంతమయ్యాయని

ఐనా బతికుంటేనేగా మేమైనా మళ్లీరేపు కల్సుకోగలం
నీ వల్ల మాకూ తప్పని ఈ భౌతిక వియోగ భారాన్ని
ఇంకొంత కాలం భరిస్తాములే
నిన్ను అంతమొందించే ఈ ప్రజా యుద్ధంలో
మేమూ గడప దాటని సైనికులమవుతాంలే!

– నిరంతర
9133832246

## వెయ్యాల్సిందే తాళం

ప్రచండ కరోనా విరుచుకు పడుతుంటే....
కరాల రక్కసి విలయ తాండవమాడుతుంటే
బీభత్స సింహనాదాలు మార్మోగుతుంటే..
మహమ్మారి రోజు రోజుకీ పెట్రేగి పోతుంటే....

మానవతామూర్తులు ప్రాణాలకు తెగించి
రక్కసిపై పోరాడుతుంటే...
ఖాకీ చొక్కాలు అహోరాత్రులు
దీప స్తంభాల్లా కాపలా కాస్తుంటే...
దైవ సేవికలు అదే పనిగా
దేశానికి పట్టిన గబ్బు వదిలిస్తుంటే...
నాయక గణం పలుమార్లు
మరణ మృదంగ హెచ్చరికలు చేస్తుంటే

వినిపించడం లేదా దీనుల ఆర్తనాదాలు..
కనిపించడం లేదా రోగుల అష్టకష్టాలు...
భయం కలగడం లేదా చూస్తుంటే పరిస్థితులు...
బాధ్యత తెలియడం లేదా చూస్తుంటే చావులు....

గుర్తెరుగు నీ బాధ్యత....
పాటించు శుభ్రత....
సామాజిక దూరం పాటిస్తేనే
కలుగును భద్రత

దేశ సేవ చేసే అవకాశం
ప్రతి పౌరుడి భుజం తట్టుతుంటే....
మహమ్మారి విజృంభనకు అడ్డుకట్ట వేయడానికి
పాటించాలి సామాజిక దూరం...
కరోనాను పారద్రోలుటకు
ఉపయోగించు శుభ్రత అనే ఆయుధం...
మనల్ని మనం రక్షించుకొనుటకు
మనసు కోరికలకు వెయ్యాలి కళ్లెం...
ఇపుడు దేశాన్ని రక్షించుటకు
ప్రతీ ఇంటికి వేసేయాల్సిందే తాళం..



–కాళంరాజు వేణుగోపాల్
8106204412





## భయం వద్దు, జాగ్రత్త ముద్దు

భయం వద్దు,ఇల్లు హద్దు
పాటించే జాగ్రత్త ముద్దు.
కరోనా అంతం, మన పంతం
సమాజ హితం,విజయం తథ్యం

తరిమి కొట్టు మహమ్మారిని
ప్రపంచం పొలిమేర దాకా,
ఆయువు నిలిచే దాకా,
నిశ్శబ్ద యుద్ధం కడదాకా

మన గళం,మన బలం
స్వీయ నియంత్రణ మార్గం
సంఘశ్రేయస్సు ముఖ్యం
నిర్మించుకుందాం రక్షణ దుర్గం

ఏకమైన బాధ్యతతో
సామరస్య భావనతో
చేతుల్ని కడగుదాం,
ముఖానికి ముసుగేద్దాం.

శుభ్రతనే పరిష్కారం
నమస్కారం,మన సంస్కారం
ధరించాలి ఓరిమి కవచం.
భౌతిక దూరం కథన రంగం

ప్రాణం పోసే వైద్యులకు,
పారిశుద్ధ కార్మికులకు
అలుపెరుగని శ్రామికులకు
వందనం, అర్పిద్దాం
సాంప్రదాయాన్నిపాటిద్దాం

కంటికి కనిపించని శత్రువు
వినాశనానికై చేయాలి క్రతువు
నివారణ ఆయుధమే మిత్రువు
ఆత్మ విశ్వాసమే నీ బంధువు



–సముద్రాల శ్రీదేవి,
9949837743

# మహమ్మారికిని మట్టు పెట్టు

మహమ్మారిని మట్టుపెట్టు
కరోనాను కట్టి పెట్టు
పరిశుభ్రతను పాటించండి
ప్రతిసారి చేతులు కడగండి
ముక్కు, కండ్లు నలపకండి
ఒకకొకరు తగలకండి
ఇంట్లో నుండి బయటకు రాకండి
అనవసరంగా తిరగకండి
వైరసుకు తగలకుండా
సరుకులు తెచ్చుకోండి
ప్రభుత్వాలు సలహాలను
డాక్టర్ల సూచనలను
తు.చ. తప్పక పాటించండి
పోలీసులకు, వైద్యులకు
సేవలందించు వారందరికీ
కృతజ్ఞతలు తెల్పండి.

విరాళాలు అందిచండి
ప్రభుత్వాలకు సహకరించండి
వలసవాదులను ఆదుకోండి
పక్క దేశాలకు వెళ్ళకండి
ఇతర దేశాలనుండి ఇక్కడికి రాకండి
విమానంలో ప్రయాణించకండి

"కరోనాను" కట్టడి చేయండి
మహమ్మారిని తరిమికొట్టండి
మనదేశంలో కన్పించకూడదు
మన మధ్య తిరగకూడదు
దాని కాళ్ళు చేతులు విరచండి
వచ్చిన దారిన సాగనంపండి"
అయినా
ఇంట్లో శుభ్రము చేయండి
పడకబట్టలు మార్చుతుండండి
ఎంత వేగంగా ఇక్కడి కొచ్చిందో
అంత శీగ్రంగా పంపించండి
ఎవరి దరికి రాకుండా
వెళ్ళగొట్టండి.



- డా॥ కర్నాటి లింగయ్య
సెల్: 9515298610

# కరోనా .. విలయం...!

ప్రార్థించుట నేరము
వేడుకొనుట ఘోరము
తొలగి పోవును కరోనా
పాటించిన దూరము

వైరస్ తోవైరము
చేయాలి సమరము
గృహములో నిలిచిన
కరోనా అంతము

కరోనా వాంఛకు
ఎదురుగా వెళ్ళకు
ఆహ్వానం పలుకుతూ
జీవాన్ని విడువకు

విశ్వ జన క్షేమము
కరోనా అంతము
త్వరగా జరిగిన
తొలగు క్షామము

లాక్ డౌన్ దేశము
వర్ణనాతీతము
పేదవారి బాధలు
తొలగు ఏ దినము ?

ఘనమైన దేశము
కరోనా వశము
శవాల కుప్పలతో
నిండేనుచూదుము

పాటించుము పత్యమును
క్వారంటైన్ నియమంను
కారోనా సమరంలో
ఇదే విజయసూత్రంను



-మొగిలి శ్రీనివాసు
9491746700

# కరోనాపై అవగాహన

కళ్ళు తెరుచుకో సోదరా కళ్ళుతెరుచుకో
కళ్ళు తెరిచి మానవాళిని రక్షించుకో
బుద్ధిగ మసులుకో సోదరా బుద్ధిగ మసులుకో
బుద్ధితోటి మహమ్మారి కరోనాను తరమేసుకో

మందులేని రోగమొచ్చె మన దేశానా
దేశమంతా చుట్టుముట్టె వ్యాధి కరోనా
నివారణయే దీనికి మందు ఓ సోదరా
వ్యక్తిగత పరిశుభ్రతను పాటించారా

మూతి ముక్కు ద్వారాలు ఈ వైరుసుకు
మనరెండు చేతులాయుధాలు ఈ కోవిడ్కు
మూతి ముక్కు మూసుకొనుము ఓ సోదరా
చేతులు శుభ్రంగా నీవు ఉంచుకొనుమురా

కన్నులుండి గుడ్డివాడు కారాదు నీవు
కన్నులుండి అంధునిగా ప్రవర్తించబోకు
బుద్ధితోటి ఆలోచించు ఓ సోదరా
తెలువితోటి మసులుకొనుట గుర్తెరుగరా

సర్కారు మాటలు నువ్ పట్టించుకో
వారు చెప్పినట్టుగానే నువ్వు నడుచుకో
ఒక్కసారి ఆలోచించు ఓ సోదరా
అడుగు బయటకేసే ముందు వెనుక చూడరా

అతి తెలివి వద్దు నీకు గుర్తుంచుకో
అత్యాశ వద్దు నీకు మనసు చంపుకో
ఒక్కసారి ఆలోచించు ఓ సోదరా
సమాజాన్ని రక్షించ నువ్వు నడుముకట్టరా

పనిపాట ఏమిలేక బయటికెళ్లకు
అత్యవసరముందంటే ఆలోచించకు
ఇంటిపట్టునుండు నీవు ఓ సోదరా
గడప దాటేముందు నీ వాళ్ళను చూడరా

ఆకలితో కొందరివి ఎదురు చూపులు
పూటకు గతిలేక వారు పస్తులున్నరు
అన్నార్తులనాదుకొనుము ఓ సోదరా
వారాకలిని కొంత నీవు తీర్చరా

భూవిపైన దేవుళ్ళు వైద్యులు అనుకో
వారితోటి దేవుళ్ళు పోలీసులనుకో
వారి సేవలను గౌరవించే ఓ సోదరా
పారిశుద్ధ్య కార్మికుల నువ్ మరవకురా

ఓపికతో వుండవలె మనమందరము
వ్యాధి తగ్గు వరకు మనం ఇంట వుందము
ఒకరి నొకరు సహకారం సల్పుకోవాలి
మనమందరము కలిసి కరోనాను తరమాలి.

-డా. జలంధర్ వాగ్మారే
సెల్: 9989597929

# హృదయం లేని మనుషులు యంత్రాలే సుమా..!



- డాక్టర్ కత్తి పద్మారావు
9849741695

యుద్ధం అంతరాంతరంగా జరుగుతోంది
ఖండాల మధ్య, దేశాల మధ్య..
మనిషిలో జీవన ఘర్షణ
ఇరవై లక్షల సంవత్సరాల నాడు మనిషి ఆవిర్భావం
ఆటుపోటులెన్నో, ప్రాకృతికమైనవి, భౌతికమైనవి
వారిది అనంత ప్రయాణం
రాతి పనిముట్టు కనిపెట్టేదాకా, అతడు అర్ధజంతువే,
మనిషి మెదడును తను సృష్టించిన
ప్రతి వస్తువు కదిలించింది
మనిషి కూడా వస్తువుగా మారాక యాంత్రికత వచ్చింది
ఆలోచనల్లో వచ్చిన స్వార్థం వినాశనానికి దారితీస్తుంది
అవును! సూర్యుడు దేదీప్యమానంగా వెలుగుతున్నాడు
తెల్లవారుజామున రెండు పక్షులు
కొన్ని కబుర్లు చెప్పుకుంటున్నాయి
ఏదో పాతపాట వినిపిస్తుంది
అందులో గిటారాల రొద లేదు
హార్మోనియమ్, తబలా, డోలక్, ఫ్లూట్,
కుండమీద దరువు స్పష్టంగా వినిపిస్తున్నాయి
ఆ అమ్మాయి కళ్ళు అమాయకంగా మెరుస్తున్నాయి
అవును! మధురగాయని 'జిక్కి' పాడిన పాట అనుకుంటా!
గుండెల్ని తాకుతుంది, మెదుదుల్ని మేల్కొలుపుతుంది
గొంతులో ఎంతో తీయదనం, ఆత్మీయత
అనారోగ్యంలో వున్నవాడికి ఔషధం
అవును! స్వరం ఆకాశ వీధులంట పయనిస్తూ వస్తుంది
ఒక కుండీలో మొక్కకు రోజూ నీరు పోసే దృశ్యాలు
అవును! రెండువందల వాయిద్యాలతో
ఇప్పుడు వీళ్ళు చెవులకు చిల్లులు పొడుస్తున్నారు
సాహిత్యాన్ని కుల్లబొడుస్తున్నారు
అపవాక్యాలే భాషగా చెలామణి అవుతున్నాయి సుమా!
వీరు దేశీయ శ్రుతులను వీడి ప్రపంచం వెంబడి బడ్డారు
అపస్మృతులే గాక, కరోనాని మోసుకొచ్చారు
నాయక, నాయికల్లో అబ్బాయి, అమ్మాయి ఎవరో తెలియదు
ఒక యుద్ధ క్రీడను పాటల దృశ్యాలుగా తీస్తున్నారు
ఇప్పుడు కరోనా వచ్చింది
వీళ్ళ లిప్‌లాక్‌లకు బ్రేకులు వేసింది
ప్రకృతి వికృతైనపుడంతా విధ్వంసమే మరి!
మనిషికి నియంత్రణ అవసరం అని
వారు తెలుసుకోలేకపోయారు
పబ్ కల్చర్ తెచ్చారు
రాత్రిని పగలు చేశారు, పగటిని రాత్రిని చేశారు

పంచేంద్రియాలను జెండాలుగా ఎగురవేశారు
కోట్లకు పడగలెత్తే ఇళ్ళు కట్టారు
అందులో పది పుస్తకాలు లేవు
బెడ్‌రూమ్‌లు, బాత్‌రూమ్‌లకు రంగూన్ రాళ్ళు అద్దారు
జ్ఞానశూన్యమైన ఇళ్ళను తుడిచేవాడు లేడు
మనుషులకు బదులు బలిసిన కుక్కల్ని పెంచారు
వాటికి మాంసం ముక్కలేసే మనిషి లేక
అవి వీళ్ళ మీద ఉరుకుతున్నాయి
కుక్కల్ని కాపలా పెట్టుకోమంటే,
కుక్కలతో కాపురాలు చేశారు వీళ్ళు..
కోటాను కోట్లతో ఖరీదైన కార్లు కొన్నారు
అవి వేగంగా నడిపి కొందరు పోయారు
ఉన్నవాళ్ళు కార్లకు పెట్రోల్ లేక అల్లాడుతున్నారు
ఈ నల్లడబ్బు దాచుకున్నవారందరూ
ఆయా దేశాలే కూలుతుంటే
ఆ డబ్బు ఏమవుతుందోనని ఆందోళన పడుతున్నారు
తన భార్య ముఖం చూడటానికి ఇష్టం లేదన్నవాళ్ళంతా
వంటింట్లో అంటులు తోముతున్నారు
చేతులు ఊపుతూ తిరిగే ప్రభువులంతా
ఇప్పుడు చేతులు ముడుసుకూర్చున్నారు
చేతికి, నోటికి అంటు వచ్చాక
వీడికి కోరికలెక్కడినుండి వస్తాయి
అగ్రరాజ్యం కూలిపోతుంటే వీరు దిగులు పడుతున్నారు
వీరి ఊరిలో కూలీలు అన్నంలేక బాధపడుతుంటే
ఆ వార్త వీరి చెవులకు వినిపించడం లేదు
వీళ్ళు మనస్సు లేని మనుషులు
ఆపద సమయంలో ఆదుకోలేని లోభి సామ్రాట్టులు
పేదలే పేదల్ని ఆదుకొంటున్నారు!
ఆసరా ఇస్తున్నారు
హృదయం లేని మనుషులు యంత్రాలే సుమా!
ఆకలి తెలిసినవాడే మనిషి
మళ్ళీ వాడే ప్రపంచానికి వెలుగు తెస్తాడు
వాళ్ళ బాటలో నడుద్దాం.

# ఇంకెన్నాళ్ళో...

ఎక్కడిదీ కరోనా ?
యమపురికిది మార్గమా ?
గంతలతో కళ్ళు మూసి
చింతల వల విసిరెనా

పుట్టినిల్లది చైనా
వచ్చును యెటు నుంచైనా
పటిష్ట గోడలను దాటి
పాకినదీ కరోనా

సంద్రాలను , ద్వీపాలను
సమస్త జన లోకాలను
ఆవరించి ఆవహించె
మహమ్మారి కరోనా

ఒక్కరితో మొదలైనా
పక్కవారి కంటుతూ
వంద వేయి లక్షలనుచు
ప్రాణములను తీసెనా

తుమ్ము దగ్గు తుంపరలో
గుమ్మరించి దండిగా
గొలుసుకట్టి తాళమేసి
దిక్కులన్ని కలిపెనా

పరమాణువు కన్ననూ
పరిమాణము చిన్నదై
అణుబాంబుని మించి ప్రాణ
హాని జరుపుచున్నది

ఖాకి , నీలి , తెల్ల కోటు
రక్షణ వలయాలుగా
అనుక్షణం పోరు సలిపి
అలిసిపోవ నున్నవి

ఎముక లేని చేతులెన్నొ
దాతృత్వం చూపినా
తాటి పండు బద్ద నక్క
మూలుగు వినిపించునా

మందు లేని కరోనాని
మట్టుబెట్టుడెట్లనో
వ్యాక్సిన్ కనిపెట్టగల్గు
దిక్సూచి యె దొరకునా

ప్రాణమున్న చాలుననే
ధైర్యంతో బ్రదుకుతూ
రేపటి వేకువకోసం
ఈ చీకటి ఎన్నాళ్ళో



- రాపోలు అరుణాస్వామి
8328277215

# కరోనతో యుద్ధమంటే

మనమిక విడిపోవడమే
దూరంగా జరుగడమే
కరోనతో యుద్ధమంటే
ఇంటిలోప లుండడమే !

మాస్కులు ధరియించడమే
చేతులు కడుకోవడమే
కరోనతో కదనమంటె
ఇంటిలోప లుండడమే !

నియమంగా బతుకడమే
కర్ఫ్యూనమలు చేయడమే
కరోనతో కయ్యమంటె
ఇంటిలోప లుండడమే !

దస్తినడ్డు పెట్టడమే
దగ్గు తుమ్ము లాపడమే
కరోనతో సమరమంటె
ఇంటిలోప లుండడమే !

కరచాలన మాపడమే
నమస్తేను చెప్పడమే
కరోనతో పోరుటంటె
ఇంటిలోప లుండడమే !

వైద్యుల మాట వినడమే
సూచన పాటించడమే
కరోనతో జగడమంటే
ఇంటిలోప లుండడమే !

కలుషితాన్ని కడుగడమే
పరిశుభ్రత పెంచడమే
కరోనతో భేదమంటె
ఇంటిలోప లుండడమే !

పనులు వాయిదేయడమే
సర్దుకొంటు సాగడమే
కరోనతో దూరమంటె
ఇంటిలోప లుండడమే !

ఆరోగ్యం పొందడమే
హాయిగ జీవించడమే
కరోనతో ఆజియంటె
ఇంటిలోప లుండడమే !

సద్బుద్ధిని చెప్పడమే
సన్మార్గం చూపడమే
కరోనతో వాదమంటె
ఇంటిలోప లుండడమే !

ప్రజల మేలుకోరడమే
చైతన్యం పరచడమే
కరోన రాకూడదంటె
ఇంటిలోప లుండడమే !



-వడిచర్ల సత్యం
సెల్:7989511543

# అంతస్సూత్రం

ప్రకృతి అణువణువులో
ఒక జీవన రాగం..
పక్షుల కలరవాలతో
ప్రతి కొమ్మా ఒక నవీన కావ్యం
గాలీ,నేలా,నదులూ, పర్వతాలూ
మనుషుల తాకిడిలేక
కాలుష్య కల్మషాలకు దూరంగా
మనోహరంగా
పల్లవించే ప్రశాంత గీతం.

అనుక్షణం రణరంగమేదో
జరుగుతున్న తీరుగా
భీకరమగు వాహన రొదలకు
కురుక్షేత్ర సంగ్రామానికి కదిలే
మానవుల కదలికలకు
లాక్ డౌన్ సూత్రం
వేసింది తాళం.

ఇంటింటా సందడితో
ప్రతి కుటుంబం
ఆత్మీయతల పవనం

ఆనంద నందనాల వనమై
సాగుతున్న గృహ తీరం.

ఎప్పటికీ సాగాలి
ఈ స్వచ్ఛతా సమీరం
జగమంతా మోగాలి
నియంత్రణా సంగీతం.

కరోనా తెచ్చిన క్రమశిక్షణ
అంతస్సూత్రం కావాలి.
పల్లవించు పచ్చదనం
భూగృహాన విరియాలి



-వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

# మేలుకుంటున్న మానవత్వం

కళ్ళముందున్న
కాలమిపుడు
పూర్తిగా మారిపోయింది

మనం ఉంటున్న
ప్రపంచం తలక్రిందులై వేలాడుతోంది

నిన్నా మొన్నటి వరకు క్షణం తీరిక లేని
జన సందోహంతో కిటకిట లాడిన
వీధులన్ని నిర్మానుష్యంగా మారి
వెలవెలబోతున్నాయి
అలుపెరుగని ప్రయాణంతో
నిత్యం ముందుకు నడిచే

బడులు-గుడులు
రైళ్లు - బస్సులు

షాపింగ్ మాళ్ళు
సినిమా హాళ్ళు

నిత్యకళ్యాణం పచ్చతోరణంలా
విలసిల్లుతూ భూతల స్వర్గాన్ని తలపించేవి

అంతలోనే ఏమైందో ఏమో?
కనబడని కరోన
ఎక్కడ నుండి దాపురించిందో?

భయంకరమైన దాని
రూపంచూసిన ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని
పరిగెత్తుతూ ఎక్కడి వాళ్ళక్కడే
చెల్లాచెదురై కనబడకుండా మాయమయ్యారు

ఎవరూ ఊహించని పరిణామంతో అల్లకల్లోల
మైన ప్రపంచం ప్రాణ నష్టంతో తిరిగి
కోలుకోనంతగా దెబ్బ తింటుంది

ఇంత కాలం ప్రజల తాకిడికి తట్టుకోలేక
కాయిల పడ్డ ప్రకృతి ఇపుడిపుడే కొద్దికొద్దిగా
కోలుకుంటూ ఊపిరి పీల్చుకోంటుంది

తలపొగరుతో మిడిసి
పడిన నేటి ఆధునిక మానవుడు
తనలోని మానవత్వాన్ని మేలు
కొల్పుతు మాధవుడి రూపంలో
కష్టమున్న ప్రతిచోట కనిపిస్తున్నాడు



-జవేరియా
9849931255

# తీరాలకు చేర్చుదాం....

మూసుకున్న తలుపుల వెనుక
ఇన్నాళ్ళుగా దాక్కున్న హృదయాలు
ఇప్పుడు అనురాగపు జల్లులలో తడిసి ముద్దవుతున్నాయి...
తోటి జీవుల కాలే కడుపులకు తమ శక్తి కొద్దీ
లేపనం పూయడానికి ఒకరికొకరు
సామాజిక దూరం పాటిస్తూనే
చేతులు కలుపుతున్నారు.. ఆత్మీయంగా...
ఇన్నినాళ్ళు మనిషితనం మరచి

కాలం వెంబడి పరుగులు తీసిన హృదయాలు...
మనిషిగా బతకడానికి కృషి చేస్తున్నాయి...
తినే ముద్దలో ఒకటి తగ్గించుకొని అయినా
పక్కోడి కడుపుకు కొంచెం ఊపిరి పోస్తున్నాయి...
గట్టి సంకల్పంతో కలుసుకున్న మనసులు
ఎన్నో విజయ తీరాలకు చేర్చిన ఘనత మనది
ఎదిరించాల్సిన తరుణం ఆసన్నమైనప్పుడు
ఏముంది..బెదురుకోవాల్సిన అవసరం
సమాజాల ఔన్నత్యాలను
సమిష్టిగా పోరాడి నిలబెట్టాల్సిన తరుణం.

బతకడమే అవసరం అయినప్పుడు
పోరాటమే మన పథం కావాలి...
ఉమ్మడి శత్రువుపై అలుపెరగక పోరాడి
విజయ తీరాలు అందుకొని తీరాలి
ఎన్నో వేల ఉషోదయాలకు
మనస్ఫూర్తిగా పలకాలి స్వాగతం
విశ్వమంతా కల్సి మనుగడకై సాగించే పోరాటంలో
విడివిడిగా ఒక్కటై సమిష్టిగా పోరాడదాం
కొన్ని నాళ్ళు వేచిచూసి అయినా
కొత్త ఉషస్సులను భావి తరాలకు అందిద్దాం..

కరోనా వికృత కరాల కేళి మోగిస్తూ
సమస్త లోకాలను మృత్యుహేళీ ఆడే వేల
భూమాతంత సహనాన్ని అరువు తెచ్చుకొని
నిదానంగా అయినా పారద్రోలుదాం....
జగతికి పట్టిన పీడను వదిలిద్దాం...
అలుపెరగని జీవిత సమరంలో
అంతిమ విజేతలము మనమే అవుదాం...
కొన్ని రోజులు వేచి చూద్దాం...
అవిశ్రాంత పోరాటకులకు
మనవంతు సాయం చేద్దాం...
వారి శ్రమను వృధా కానీయ్యక
రేపటి నీ శ్వాసకు కొత్త శక్తిని ఇద్దాం...
ఇపుడు దేశం ఒక అనంత దుఃఖ సాగరం...
సహకారాన్ని అందించి
మానవత్వపు తీరాలకు చేర్చుదాం



-కాళంరాజు వేణుగోపాల్
8106204412

# ఏమంటున్నది కరోనా

డాలరుందని కాలరెగరేసిన మనిషి దర్పం
గాలి బుడగలా పేలిపోయింది

భూగోళంతో ఆడుకున్న ఆయుధాగారాలు
బూచి బుచ్చకాయ ముందు బుటుకుమన్నాయి
కరోనా కనుకట్టుకు తలకిందులైన దేగ కళ్ళ నిఘా

నాడు లోకాన్ని అదుపు చేసిన ప్రపంచ ఖాకీలు
నేడు వైరస్ అధీనంలో తుస్సుమన్న మూకీలు

చక్రం తిప్పిన అగ్రరాజ్యాల పరువు
వక్రగతి పట్టించిన దుర్జాతి నిర్జీవ సూక్ష్మాంశువు

లెక్కే లేదన్న అవహేళనకి
చుక్కలు చూపిన అల్పీయము

ఎందరికో ఆశ్రయమిచ్చిన పచ్చని కుటీరం
ఇలా కరోనా కోరల్లో నలుగుతున్న కఠోరం

అభిమానం పంచడమే అగ్రత్వమని
పెద్దలకు నేర్పింది పిసరంత కణము

రాజుల మనుకున్న వారి బూజు దులిపేసింది
బంటును పట్టుకున్నట్టే రాజునూ పట్టుకొని
రాజూ బంటను భేద మింక వలదంది

తెలుపైనా నలుపైనా
తనను చూసి పారిపోయే వారి భయం ఒకటే అంది

మనసును ప్రేమ పాత్రగా మలచుకో అంది
మనిషిని మనిషిగా చూడమంది

కడుపు వల్లకాడైనట్టు
కనబడిన జీవినెల్లా పొట్టన పాతేస్తే
ఫలిత మిలాగే ఉంటుందని

చావుతప్పి కన్ను లొట్టబోయిన
సర్పాహారుల కళ్ళు తెరిపించింది

కరోనాతో చెలగాటం
గబ్బిలం తిన్నంత సులభం కాదంది

అందరితోపాటు నీవూ ఒక కొమ్మమీద కూర్చొని
చీడ పురుగును తయారు చేసి చెట్టు మీదకి వదిలిపెట్టే

ఉన్మాద స్వర్గాన్ని కరుకో వద్దని
వేటు వేసి తాట తీసి ఘాటుగా చెప్పింది

కొట్టి నేర్పిస్తారు తిట్టి నేర్పిస్తారు
సబబు గాకున్నా చావులతో నేర్పడమే
తన శైలి అన్నది.



-చిరమన వెంకట రమణయ్య
94413 80336

# వెలుగుల కల!

నిన్న మొన్నటిదాకా
ప్రతి రోజూ ఆత్మీయ ఆలింగనాలు
గట్టి కరచాలనాలు
కబుర్ల గలగలలు
విరగ పడే నవ్వుల సవ్వడులు
చుట్టూ మనుషుల
ఉరుకులు, పరుగులు
వీధుల్లో, పార్కుల్లో
పిల్లల కేరింతలు
అన్నీ మటుమాయమై పోయి
ఏదో తెలియని మృత్యు ఘోష
అంతటా అలుముకొని
నిండు పగలు కూడా
నిశ్శబ్ద చీకటి కమ్మేసినట్టు
'ఏ సన్నాట క్యో హై భాయి'
అని హంగల్ ముసలిగొంతుకతో
అందరినీ నిలదీస్తున్నట్టు
ఒక్కో రోజును రాత్రి పగళ్ళ
లెక్కలేసు కుంటూ కాలాన్ని
గోడమీద కాలండర్ లోని
చదరంగం గడులను దాటుకుంటూ
గడిపేసిన రోజుల్ని లెక్కిస్తూ
గడపాల్సిన రోజుల లెక్క చిక్కక
అయోమయ స్థితిలో

పెరిగే మరణాల సంఖ్యతో
పెరగని రికవరీ కేసులతో
కొత్తగా సంక్రమణకు గురైన
అభాగ్యుల అంతుపట్టని పట్టికతో
పాత లెక్కల్ని చెరిపేస్తూ
రోజుకో కొత్త గణాంకాలతో
అల్లకల్లోల పరుస్తున్న
వార్తలతో, ప్రకటనలతో ఉక్కిరిబిక్కిరై
రెక్కలొచ్చి దేశాంతరాలు
ఎగిరిపోయిన పిల్లల,
మిత్రుల చరవాణి పలకరింపులు తప్ప
ఏ దిక్కు తోచక స్వంత ఇంటిలోనే
ప్రపంచాన్ని వెలివేసుకొని
ఏకాంతంగా కాలం గడిపేస్తుంటే
ఇన్నాళ్ళ జీవన సంగ్రామంలో
ఎక్కిన శిఖరాలు
జారిపడ్డ అగాధాలు
దారివెంట ఎదురైన అడ్డంకులను
మననం చేసుకుంటూ
నిద్ర రాని ఈ రాత్రిని
రెప్పలతో మూయాలని
శత ప్రయత్నాలు చేస్తున్న నాకు
అప్రయత్నంగా పక్కనున్న సహచరి
అమృత హస్తం గుండెను తాకి
నీకు నేను, నాకు నువ్వు
ఒకరికొకరం ఇంకా మిగిలే ఉన్నాం
దిగులెందుకు అంటూ
దిటవును నింపేలా
ప్రేమ పసరు లేపనం అద్దినంతనే
ప్రశాంతంగా నిద్ర ఒడిలోకి జారుతూ
ఆశగా ' ఆనందం' తో
రేపటి వెలుగుల కలను కంటున్నాను!



-డా. కె. దివాకరా చారి
9391018972

# కరోనాటవెలదులు

ఆ.వె.
చైన దేశమునను జన్మించియు కరొన
దేశ దేశములకు తిరిగి తాను
సూక్ష్మజీవియైన చుక్కలు సూపిస్తు
జగతి యందు జనుల ప్రగతి మార్చె
ఆ.వె.
సూక్ష్మజీవులంటె సులువు కాదనుచును
దగ్గు, తుమ్ములల్ల దగ్గరున్న
వారికి, సులభముగ వ్యాప్తి చెందిన తాను
మృత్యువొడికి చేర్చె మృత్యువయ్యి
ఆ.వె
లాకుడౌను మనల రక్షించును నిజము
గడప దాటకున్న కరొన రాదు
బైట కాలు బెడితె లాటి దెబ్బ తగులు
బైటకెళ్ళ బోకు బాటసారి

ఆ.వె.
అగ్రరాజ్యమైన నాగమాగమయెను
భేదమేమి లేదు వేదనందు
మేలు జరిగె మనకు పాలకుల వలన
భారతీయ వీర ధీర శూర
ఆ.వె.
లాకు డౌను వలన లాభమెంతననగ
విచ్చలవిడి వ్యాప్తి వీగి పోయె
బంధముల మరిచియు నంధకారమునున్న
మానవులను మార్చి మంచి దెలిపె.



-నల్లగొండ సురేశ్
7893636501

# కాలంతో పాటూ

కరోనా భూతం దోబూచులాట కు..
ఆ భవిత పునాదుల గూడులో
పుస్తకాల పుటలకు మూతలు పడ్డాయి
పాఠశాల కంఠం బోసిపోయింది
బాలల హారాలను
గృహాలు దాచేసుకున్నాయి కదా!
తన వడి చిన్నబోయింది
సందడి చేసే చదువుల కూనలు రాక
నల్ల బల్లలు తెల్లబోయాయి
జ్ఞానం మొలకెత్తించే తెల్లవిత్తనాలు లేక
నిత్యం బువ్వ పువ్వులను
పూయించే వంట గదులు

వాడిపోయిన ఖాళీపాత్రలను బోర్లించాయి.
ప్రశ్నలతో నిండాల్సిన
పరీక్షా పత్రాలకు పరీక్షే ప్రశ్న అయింది
పోటీ లేని పరుగు పందెంలో
నిర్ణేతలూ లేరు, బహుమతులూ లేవు
బోధనా శాల బాధ్యత ,అద్దంలో
సందిగ్ధ ప్రతిబింబం చూపిస్తోంది.

సందిగ్ధతకి చాపచుట్టేసి
పాఠశాల తన బోధనా వ్యూహానికి
రెక్కలు తొడిగి స్వేచ్ఛా విహంగాన్ని చేసింది
ఇప్పుడు నల్లబల్లలను చరవాణి
తెరలు అద్దెకు తీసుకున్నాయి
తనవద్దకు రాలేని పిల్లలను

పలకరించడానికి తరగతి గది తానే వెళ్తోంది
నాలుగు గోడల మధ్య చదువు
హద్దులు లేని బోధనను చేస్తోంది.
గూగులమ్మ ఇపుడు పాఠశాల ప్రాంగణమైంది
ఏదైతేనేం! కాలంతో పాటు కదలకపోతే
కాలం లో కనుమరగవడం ఖాయం!



-చావలి శేషాద్రి సోమయాజుల
7013344354


















# అనుభవాలే కన్నోజు కవితలు



## మెరుపులు

భూలోక మందునా
భూతమై చెలరేగి
హరిస్తున్నది కరోనా
జనుల రక్తాన్నిమరిగి

అంతిమ సంస్కారము
చేయండి కరచాలనికి
శుభ స్వాగతము
పలకండి నమస్కారానికి

కారు మబ్బులు
మృత్యువాన
చావుల ఉరుములు
కరోనాకాలాన

అన్నిజీవుల పోరాటం
ఆకలి కోసం
మనిషి ఆరాటం
కాసుల కోసం

–శీలోజు శోభన్ బాబు
9676858160

కుక్క మంచం, చేతికర్ర, గంగాళం, డొక్కుకుర్చీ, తొక్కు జాడీ, చెక్క బల్ల, మొక్కి చీపురు, బొట్టుపెట్టె, అతుకుల బొంత, ఏమిటీ పాత వస్తువులు అనుకుంటున్నారా? బహుశాః ఈతరం యువత చూసి వుండరు. కనీసం చాలామంది విని కూడా వుండరు. కానీ యివన్నీ కవి కన్నోజు లక్ష్మీ నారాయణ ఎంచుకున్న కవితా వస్తువులు. సనాతన సంస్కృతి, ఆచార వ్యవహారాల పట్ల ఆరాధన భావంవున్న కన్నోజు కవిత్వంలో "నాస్టాలజీ కొట్టొచ్చినట్టు కనబడ్తుంది.

**"నిన్న రేపుల గురించి ఆలోచించని**
**నిర్దయతో వుంటున్న యువతకు**
**పాత వస్తువుల విలువేంటో తెలియదు**
**బంధాలూ, అనుబంధాలు అంతకన్నా తెలియవు"**

యిదీ కవి ఆవేదన.

**"అమ్మా నాన్నల్నే**
**ఆశ్రమాలకు పంపిస్తున్న రోజుల్లో**
**అమ్మమ్మ, నానమ్మ లెవరిక్కావాలి**
**వాళ్ళు వాడేసిన గంగాళ (పాత వస్తువులు) మెందుక్కావాలి"**

వృద్ధాప్యంలో వున్నకన్న తల్లిదండ్రుల్నే బయటకు విసిరి కొడ్తున్న ఈ అనాగరిక సమాజంలో ఎప్పుడో వాడి పారేసిన వస్తువులకు యింట్లో చోటేది?

**"డాబా మీది స్క్రాప్ కార్నల్లో**
**పురావస్తు అవశేషంగా"** దర్శనమిస్తు న్నాయని వాపోతున్నాడు కన్నోజు.

సుదీర్ఘ కాలం ఇ.సి.ఐ.ఎల్‌లో ఉద్యోగించి ప్రస్తుతం స్వర్ణకార వృత్తిలో స్థిర పడి సాహితీ సృజనతో సేద తీరుతున్నారు. కథ, కవిత్వం, వ్యాసం, యిలా వివిధ ప్రక్రియల్లో తన రచనా పటిమను చాటుకుంటున్నారు. ఆభరణాలు తయారు చేసి అందంగా నగిసీలు చెక్కడంలో ఎంతటి సిద్ధహస్తుడో.. కవితా వస్తువును ఎన్నుకోవడంలో, మంచి కవితగా తీర్చిదిద్దడంలో అంతటి ప్రతిభాశీలి లక్ష్మీ నారాయణ.

వయస్సుతో నిమిత్తం లేకుండా మరీ ముఖ్యంగా పదవీ విరమణ తర్వాత కవిత్వాన్ని ఆశ్రయిస్తున్నవారి సంఖ్య ఈ మధ్య గణనీయంగా పెరుగుతోంది. యిదో శుభ పరిణామం. అందుకేనేమో వృద్ధాప్యం గురించి కవిత్వం తరుచుగా వినబడ్తోంది. మనిషి జీవితంలో వృద్ధాప్యం ఓ అనివార్యమైన దశ. ఈ దశను నిరసిస్తు, ఆహ్వానిస్తు, ఆస్వాదిస్తు కవితలనల్లుతున్నారు. కన్నోజు వారు "వార్థక్యానికి విచారమెందుకు"? అంటు ప్రశ్నిస్తున్నారు.

**"వద్దన్నా వచ్చే వార్థక్యం గురించి**
**అందరికీ తెలిసిందే అయినా**
**వచ్చినందుకు నొచ్చుకుంటూనే**
**పాతికేళ్ళు వెనక్కిపోతే బాగుండుననిపిస్తుంది**
**ఎన్నేళ్ళు ముచ్చటించినా.. నులివెచ్చని ఆత్మీయతే తప్ప**
**అనురాగం నిండిన ఆలుమగల్లో**
**వైరాగ్యానికి తావెందుకుంటుంది..**
**వార్థక్యానికి విచారమెందుకుంటుందీ?"**

అంటు ధైర్యం పలుకుతున్నాడు కవి. సంవత్సరం పొడవునా పాడవకుండా ఊరగాయ పచ్చళ్ళను భద్రపరిచే పింగాణీ జాడీల స్థానంలో ప్లాస్టిక్ కంటైనర్స్ వచ్చి చేరినయ్. అలాగే పాత వస్తువులన్నీ కొత్త వాటికి స్థానం గల్పించి తప్పుకుంటున్నయ్. మరివృద్ధ దంపతుల మధ్య ఎంతటి ఆప్యాయతానురాగాలు వున్నా స్థానభ్రంశం కల్పించి వృద్ధాశ్రమాలపాలు జేస్తే వారు ఏమైనా/ వస్తువులా? అన్నది కవిప్రశ్న. యింట్లోని వారి స్థానాల్ని భర్తీ చేసే వారేరీ అన్నదే కవి ఆవేదన. అందుకేనేమో.. అనేక పాత వస్తువులను ప్రతీకాత్మకంగా కవితలల్లి మనముందుంచారు. తొక్కు (పచ్చళ్ళ) జాడీని తుక్కు జాడీగా మార్చొద్దని వేడుకుంటున్నాడు.

**"ఆడుకునే బొమ్మైనైనా**
**డబ్బిచ్చి తెచ్చుకుంటాంగానీ**
**నేనేంటండీ**
**డబ్బుల్తో మీయింటికొచ్చి**
**మీరు చెప్పిందే వింటున్నానూ**
**పని మనిషిగా వుంటున్నాను"** ఓ ఇల్లాలి మనోగతం యిది. మనసు పెట్టి వింటే యిలాంటి గుండె ధ్వనులు అనేకం ప్రతిధ్వనిస్తాయి.

ఎక్కడో.. ఏమూలో ఇసుమంత ప్రేమ అణగివున్నా పురుషాధికారం ముందు ఆడదాని పట్ల ప్రేమ వ్యక్తమవ్వదు. జీవితాంతం మానసిక క్షోభకు గురయ్యే తల్లులెందరో?

**"నాన్న ఎలాంటి వాడని ఎవరికీ చెప్పలేదుకానీ అతడు ప్రేమిస్తే మరికింత బతికేదమ్మ"** అందుకే శాడిష్టు నాన్నలూ..

"వెళ్ళిపోయిన అమ్మ గురించి వెక్కి వెక్కి ఏడ్చినా
గుక్కపట్టి ఏడ్చినా.. అమ్మ కనిపించదు" అంటూ హెచ్చరిస్తున్నాడు. కాస్త ప్రేమను పంచమని హితవు పలుకుతున్నాడు.

ఈమధ్య కవుల సంఖ్యతో బాటు కవిసమ్మేళనాలూ గణనీయంగా పెరిగినాయి. శత, సహస్ర కవి సమ్మేళనాలు కవులకు వేదికలుగా నిలుస్తున్నయి. తమ కవిత చదవంగానే వెళ్ళిపోయే కవులు అధిక భాగం అవుతే.. ఓ రెండు, మూడు గంటల నిరీక్షణ తర్వాత ఓ శాలువాను అందుకుని మురిసిపోయేవాళ్ళు కొందరు.

**"చాలా మంది కవుల చెడ్డ అలవాటులాగానే**
**వేరేవాళ్ళకవిత్వం ఏ రోజూ చదవడు గానీ**
**వేలెత్తి చూపే అలవాటు మాత్రం**
**వెన్నంటే వుంటుంది"** అంటున్నారు కన్నోజు.

**"ఏం రాస్తున్నావో.. ఎందుకు రాస్తున్నావో**
**మనకు తప్ప మరోవాడి కర్థం గాదు.**
**ఎంతరాసి ఏం రాసినా**
**వాసిలేని రాశి వాసికెక్కదు మరి**
**కవిత్వాన్ని కవిత్వంలా రాసుకుందాం"**

అంటు పలుకుతున్న హితవాక్యాలు కొందరికి బాధ కలిగించినా అక్షర సత్యం యిది.

నేను సమీక్షించిన వందల గ్రంథాల్లో సింహభాగం కవితా సంపుటాలే. నా మటుకు నేను కవిత్వం ఎలా రాయకూడదో నేర్చుకున్న మాట మాత్రం వాస్తవం.

కన్నోజు వారి అభ్యర్థనను గమనించండి.

**"ఎంచుకున్న విషయాన్ని**
**ఏవగింపు కలిగించేలా రాయకండి**
**నలుగురు నచ్చేలా రాయండి**
**అందరూ మెచ్చేలా రాయండి"**

అంతేగాదు
'కవిత్వం కవిత్వంలా రాయండి' అన్నది అతర్లీన ధ్వని.

గ్రంథ పరిచయం వేదు. సమీక్ష వేరు. సమీక్ష రాయడమంటే గ్రంథాన్ని క్షుణంగా అధ్యయనం చేయడమే. సమీక్షలో విమర్శకు తావుంది. లోటు పాట్లను చర్చించే వెసులుబాటు వుంది. మంచీ చెడులను ప్రస్తావించే అవకాశం వుంది. ఓ విధంగా సమగ్ర సమీక్షకు, విమర్శకు అట్టే తేడా లేదు. స్వతహాగా గ్రంథ సమీక్షకుడైన కన్నోజు లక్ష్మీనారాయణ "పుస్తకం చదవకుండానే.. సమీక్షలు చేస్తున్న" వ్యక్తులు ఓ విసురు విసిరారు. ఏ అనుభవం వారితో యిలా అనిపించిందో ఆయనే చెప్పాలి.

సమాజంలోని మనుషుల పోకడలను, బలహీన పడ్తున్న మానవీయ విలువలను ప్రపంచీకరణ దుష్ఫలితాలను, మాతృభాషపట్ల వివక్షను, భ్రష్టుపడ్తున్న మన సంస్కృతీ సంప్రదాయాలను తన కవితల్లో ప్రతిభావంతంగా చిత్రిక పట్టారు. వస్తు వైవిధ్యంతోబాటు, బలమైన వ్యక్తీకరణ గుప్పించారు. మంచి కవిత్వం నుండి గొప్ప కవిత్వంవైపు ఆయన సాహిత్య ప్రస్థానం కొనసాగుతుందని నా నమ్మకం.

ప్రతులకు:కన్నోజు లక్ష్మీకాంతం
ఇ.నెం.18–3–463/1/1/175/1
రాజన్న బావి, ఫలక్‌నుమా
హైదరాబాద్–500 053
సెల్: 9246338115,






–రమణ వెలమకన్ని
సెల్: 9866015040



## సైనికా..

సరిహద్దులలో ప్రాణాలు పణంగాపెట్టి
దేశంకోసం పోరాడేవారు
సైనికులు.. రక్షణ కవచాలు !

తన వారిని వదిలి
తూటాలకి ఎదురునిలిచేవారు
సైనికులు.. నిజమైన దేశభక్తులు !

దేశం ఏమిచ్చింది అని కాక
దేశం కోసమే ఆరాట పడేవారు
సైనికులు ...నిస్వార్థ పరులు !

ప్రమాదం అంచున నిల్చుని
పరివారానికి దూరమై యుద్ధం చేసేవారు
సైనికులు..విధినిర్వహణ పారాయణులు!

నిద్రాహారాలు మాని దేశసేవ చేసేవారు
ఎవ్వరి ప్రశంసలు ఆశించనివారు
సైనికులు .భరతమాత ముద్దు బిడ్డలు !

మంచుకొండలమధ్య పహారా కాస్తూ
మరణం ఎదురైనా వెనుకడుగు వేయరు
సైనికులు.. జాతి రక్షకులు !

అయినవారిని కోల్పోయినా
మనోనిబ్బరంతో కాపలా కాస్తుంటారు
కఠినంగా వ్యవహరించే సున్నిత
మనస్కులు !

పండుగ సంబరాలు దూరం చేసుకుని
చొరబాటులు జరగకుండా
రక్షణగా ఉంటారు
సైనికులు..విశాల హృదయులు !

భారతదేశ కీర్తి,ప్రతిష్టలను
నిత్యం పెంపొందించే ధీరులు
సైనికులు.. నిజమైన మార్గదర్శకులు !

ఎన్ని అవాంతరాలు ఎదురైనా
మొక్కవోని ధైర్యంతో
ముందుకు కదులుతారు
సైనికులు..
నిత్య చైతన్య మూర్తులు !



– సునీత బందారు
9440671530

## ఇక బాధ్యత మనదే!!

సగటు మనిషిని.. నేను
సయుక్తి సంఘ జీవిని నేనే
అచ్చ సంస్కృతి భారతీయుడ..నేను
బరితెగింపు లేనే లేదు
భయమన్నది అసలే లేదు
బాధ్యతాయుక్తితో
నా భార్యా..పిల్లలతో
ఇంటిపట్టునే. ఉన్నా
కరోనా.. అయినా..
ఖరకు రాక్షస వైరస్ అయిన
నా గుమ్మానికి వ్రాసిన పసుపు చూసి
నా ఇంట కర్పూర వాసన చూసి
నా ఇంటి దేవుడి జ్యోతి చూసి
వైద్యులే నారాయణులై
చేస్తున్న సేవల చూసి
రక్షక యంత్రాంగం.. నిబద్ధతగా జనాల
నడిపించే..తీరు చూసి
మానవత్వ..దాతృత్వ..దాతల చూసి
పాలనావర్యుల..పాలనా దక్షత చూసి
మాడిపోదా కరోనా
పారిపోదా దాని తాతైనా..ఏదైనా
ఇంటనే ఉండి..అంటక.. ముట్టక
ఊపిరికి.. ఊపిరిపోసి
నా జాతికి.. జీవాన్ని చూపి
భరతమాత గర్వించేలా
యావత్ ప్రపంచం
చప్పట్లు చరిచి పొగిడేలా
నాకు..నీవుగా..నీకు..నేనుగా
నీవు..నేను అందరమై
తరిమేద్దాం కరోనాని
నిశ్శబ్దంతో చేసేద్దాం..! దేశసేవని
మానవ సేవే.. మాధవన సేవని
ప్రపంచానికి..చాటిచెప్పుదాం
భారత్ మాతాకి జై..

– జె. నరి సింహారావు
సెల్:

## ఆదర్శం నా దేశం

తుమ్మితే వచ్చే తుంపర్లు
మన బతుకు పాలిట శాపాలు
దగ్గితే దద్దరిల్లితున్నాయి
భూగోళాలు..
చేయి చేయి కలపకు
రోగాన్ని కొని తెచ్చుకోకు.
ప్రపంచానికి సంస్కారం నేర్పింది
మన నమస్కారం.
ఇపుడు నమస్కారమే
మన ఆరోగ్యానికి సంస్కారం.
ప్రపంచ దేశాలకు పెద్దనై ...
వైద్యసహాయం చేస్తుంటే. స్విజెర్లాండ్
మెటర్న్ హార్న్ పర్వత శిఖరంపై
నా భారత జాతి త్రివర్ణ పతాక
రెపరెపలు.
ఇది తెలుపుతుంది విజయానికి
సంకేతాలు
కోవిడ్ 19పై కలిసి కట్టుగా పోరాటం
ఇపుడు నా భారత దేశం అవుతుంది
ప్రపంచ దేశాలకు ఆదర్శం.
మిత్రులారా....
గాలిలో తిరుగుతుంది వైరస్
ముఖానికి మాస్క్ వేసుకోకుంటే
మన బతుకు అవుతుంది మైనస్..
ప్రపంచం కరోనా కబంధ హస్తాల్లో
చిక్కుకొని ఉంది.
బతకాలని ఆశ బలంగా ఉంది..
గుండె నిబ్బరం చేసుకొని
గూటిలోనే ఉండిపోండి..
అజాగ్రత్తగా ఉండి కోవిడ్ ని
కొనితెచ్చుకోకండి.
బాధ్యతగల దేశ పౌరుడుగా మసులుకో..
కరోనాను అంతం చేయడానికి
ప్రతిన పూనుకో..
నిశ్శబ్ద యుద్ధంలో అందరం
పాత్రదారులై పోరాడుదాం..
కరోనాను అంతం చేద్దాం...



–అశోక్ గోనె
9441317361

## కరోనా పై తిట్ల దండకం

రాక్షసి, రక్కసి, ముదనష్టపు దానా, దరిద్రపు ముండా,
ఎక్కడ పుట్టావు, ఎక్కడ దిగావు, ఎక్కడ తిరిగావుమాయలమారి ,
ముండా ఏ ప్రాచి దాన,తిరుగుబోతు, కంటపడిన వాన్ని లాగేసే
దరిద్రపుగొట్టు, మనుషుల మధ్య దూరి, నిలువునా ముంచి, ముష్టి, పాపిష్టి దాన, అక్కు పక్షి, నీకు దూమ్ తగల,నీ కళ్ళల్లో కారం గుట్ట, నీ నోట్లో మన్ను పొయ్య,నీ బతుకు జిమ్మడ, నిద్రలోను నీ ఆలోచనలే గబ్బు దాన, కిలాడి, శంఖినీ, డాకిని, మోహిని, లంకిని, కుటుంబంలో కలహాలు సృష్టించి, ఒకరినొకరు వేరు చేస్తివి, నీచ నికృష్ఠదానా, ప్రకృతిని మార్చి,మనుషులను నిలువెల్లా ముంచితివి, సిగ్గులేదు శరం లేదు, నీ మొహం మండ, ఎక్కడి నుంచి వచ్చి సచ్చావే, ఎందరికో పనిలేకుండా చేసావు, జాలి లేదు దయ లేదు ఎలా పుట్టావే, వంకర మూతి దానా, ముల్ల పంది దాన, వేషాలు మార్చే వేశ్య,దేశ దేశాలు నిన్ను చూచి వణుకుతున్నాయి, ప్రపంచమంతా గడగడలాడిస్తువే కరోనా కంత్రి దాన,ఎక్కడ చస్తావు ఎప్పుడు చస్తావు, స్మశానంలో పీనుగ, నీతి మాలిన దానా, పిల్లలు వృద్ధులు తేడా లేకుండా వావివరుసలు లేకుండా తిరుగుతున్న మహమ్మారి, కల్లోలాలు సృష్టించి
మనిషిని అతలాకుతలం చేసి విట్టహాసం చేస్తున్న
సూర్పణక, ముక్కులోకి జొరబడి, నోట్లో కి దూకి,
ఊపిరితిత్తుల్లోకి చేరి, మనిషిని పిలిచి పిప్పి చేసే
చీడ పురుగుగా, విష పురుగా, పోయే మమ్ముల్ని వదిలి పోయె, నీకు పెడుతున్నాం దండాలు తల్లి, వదలవే పీడ జ్వరమా, కుళ్ళి కృషించి చావే,
దరిద్రపుగొట్టు, మహమ్మారి, మాయలమారి,
చాలించు నీ వేషాలు, వైద్యులు నూరుతున్నారు కత్తులు, మేమంతా సుఖంగా
ఇంట్లో ఉంటాం,
మా చేతులు కడుగుతాం , నీ చావు తప్పదు
పోవే ఇక ఉరుకవే, శని దానా,...



–కొప్పుల ప్రసాద్
9885066235

## ఎందరు గుర్తుంచుకుంటారో??. ఒడ్డెక్కిన మరుక్షణం

నొక్కింది ఫాస్ బటన్ భూగోళం
ఆగింది ప్రపంచ గందరగోళం
భూమికి చేస్తున్న నష్టాలగురించి
ఆలోచించాల్సిన సమయం
భూమాత గోడు
వినకతప్పని తరుణం
ధరిత్రి ఇక నొక్కింది రీసెట్ బటన్
ఇదే అదనుగా అయ్యింది
ఆకాశం నిర్మలంగా
పారుతున్నాయి
నది జలాలు స్వచ్ఛంగా
పక్షుల కిల కిల రాగాలతో
పులకిస్తోంది అడవి అందంగా
తోచింది అందరికి
ఇది ఒక
ఆలోచించాల్సిన విషయంగా
భోదపడితే మంచిది
జీవించాల్సిన అసలు విధానం
ఆచరిస్తే ఆరోగ్యం
అంతటా ఆనందం
ఎందరికి అర్థమవుతుంది మరి
ఈ అనుభవ పాఠం
ఎందరు గుర్తుంచుకుంటారో
ఒడ్డెక్కిన మరుక్షణం
మనలాగే అన్ని జీవులకు
జీవించే హక్కు ఉందని
మనం చేసే వినాశనానికి
అవి ఘోషిస్తున్నాయని.

–ఎ. ఎమ్. జయశీల
సెల్: 8374269508

## ముందే తెలిస్తే?

తన మరణం గురించి ముందే తెలిస్తే...
బంధాలు , అనుబంధాలు,
ఆత్మీయతలు, స్నేహాలు..
వీటన్నిటినీ వదలి వెళ్తున్నామనే ఊహనే తట్టుకోలేము.
"నేను లేకుండా నావాళ్ళెలా వుంటారో? " అనే
దిగులే చాలా బాధను కల్గిస్తుంది.
మరి అదే నిజమైతే తల్లిదండ్రుల , తోబుట్టువుల
కట్టుకున్నవారి, స్నేహితుల బాధ వర్ణనాతీతం .
నిజమే మరి
" మరణం గురించి ముందే తెలియకూడదు".
ప్రాణాలు కూడా ఇచ్చేంత ఆత్మీయులు ఎందరున్నా..
తరతరాలుగా తిన్నా తరిగిపోని ఆస్తులు,
అంతస్తులున్నాయని
'మరణం నిన్ను కాటేయక మానదు'
తన మరణం గురించి ముందే తెలిస్తే ....
బతికి ఉన్నపుడే కాక మనం పోయాక కూడా
నలుగురూ మనల్ని తలచుకోవాలి అంటే..
మనకు వీలైనంతలో
ఇతరులకు సహాయపడటం వల్ల
తరతరాలుగా వాళ్ళ మనసుల్లో బ్రతికే వుంటావు.

–వేముల ప్రేమలత
హైదరాబాద్.

## నాకెందుకో.. అలా అనిపించదు

నాకెందుకో.. అలా అనిపించదు
ఇంట్లో అది మౌనం నేర్పింది
ధ్యానం చేసుకోమంది
నా వాళ్ళు నలుగురితో కలిసి భోంచేయడం నేర్పింది
చక్కగా కలిసి మంచీ–చెడూ మాట్లాడుకోమంది
మరింతగా పరిశుభ్రత నేర్పింది
స్వచ్ఛ భారత్‌కు అచ్చమైన భాష్యం నేర్పింది
పారిశుద్ధ్య కార్మికులలో సేవ నిరతి పెంచింది
వైధ్యుల్లో ఆత్మ స్థైర్యం పెంచింది
ఎప్పుడో.. ఎక్కడో..
చిక్కిపోయిన మిత్రులపైన చరవాణి ద్వారా
తీపి తేనల్ని చిలకరించుకోమంది
పెళ్లి వేడుకల్లో లాంఛనంగా
పలకరించే బంధువుల్ని మనసు విప్పి మాట్లాడుకోమంది
ఆప్యాయత పెంచుకోమంది
మైత్రి సూత్రాన్ను ధృవ పరుచుకోమంది
ఇంటి పనుల్లో– వంట పనుల్లో భాగస్వామ్యం పెంచుకోమంది
ప్రసార మాధ్యమాల్లో ప్రయోజకరమైన లేమిటో
విశ్లేషించుకోమంది
మన మన కళల్ని ప్రతిభను సానబెట్టమంది
మొక్కలకు నీళ్లుపోసి– హరిత వీణాతంత్రుల్ని
సమరించుకోమంది
రక్షక భట సేవకు అక్షర హారతి సమర్పించుకోమంది
అయినా
మానసిక క్షోభను అణుచుకుంటూ అడగాలనిపిస్తుంది
ఇది చెప్పడానికి ఇంత మందిని
బలి తీసుకోవడం న్యాయమేనా..॥కరోనా॥



– పి.విభైరవన్ శర్మ
సెల్: 8367524003

## పల్లె చెప్పిన పాఠం

మావాడు హైదరాబాద్
అలాగా
మా అమ్మాయి, అల్లుడూ అమెరికా
పల్లెల్లో ఇల్లిల్లూ పైకి గొప్పలు చెప్పుకున్నా
ఎదిగేతరం బొత్తిగా లేక
ఊళ్ళూ ఇళ్ళూ బాగా బోసిపోయాయి
ఇది న్నిటి చిత్రం
కానీ, కరోనా పుణ్యమా అని
ఇళ్ళు,ఊళ్ళు అన్నీ కళ్ళలాడుతున్నాయి
అమెరికాలు,హైద్రాబాదులు
ఇపుడు, అగ్రహారపు నివాసాల్లో
సహవాసాలు చేస్తున్నాయి
రెండు రోజులుండెళ్ళరా బాబూ!
అంటే
నిప్పుల మీద వున్నట్లు ఫీలయ్యే కొడుకు
ఇప్పుడు రెండు నెలలైనా కిమ్మనడంలేదు
జ్ఞాపకంగా మిగిలిపోయిన
ఉమ్మడి కుటుంబాలు
మళ్ళీ అనుభంలోకి వస్తున్నాయి
అక్కా, చెల్లి, అన్నా తమ్ముడు
వదినా, ఆడపడుచు
చుట్టరికాలు మళ్ళీ పట్టంకట్టుకుంటున్నాయి
మనవలు, మనవరాళ్ళు అంటే
మోగుతున్నమంగళ వాద్యాలే
ఎప్పుడూ చేలోకి పరిగెత్తె కాలవనీళ్ళు
ఇప్పుడు పరుగులో వేగం తగ్గించాయి
ఊరి జనం స్నానాలు చేస్తే పునీతమౌదామని
కర్రా బిళ్ళా, అష్టా చెమ్మా
పేర్లు మర్చిపోయిన ఆటలకి
మళ్ళీ జవజీవాలొచ్చాయి
వామన గుంటల ఆటకోసం
చింత గింజలకు గిరాకీ పెరిగింది
రాత్రిపగలు తెలియని అగ్నిహోత్రుడు
వంటింట్లో కొలువు చేశాడు
పిజ్జా, బర్గర్‌లతో చవిచచ్చిన నాలుకలకు
పాతరుచుల విందు చేస్తున్నాడు
చందమామ,వీధి అరుగులకు
వెన్నెల ముగ్గు వేస్తున్నాడు
కాలం చెల్లిన జ్ఞాపకాలు
ఇప్పుడు,కబుర్లలో నుంచి ప్రవహిస్తున్నాయి
కరుణలేని కరోనా, నగరవీధుల్లో
కర్ఫ్యూ విధించినట్టుంది కానీ
ఆత్మీయతలను,ఆప్యాయతలను
దోసిళ్ళతో తెచ్చి
పల్లెల్లో రాసులు పోసింది
ఇప్పుడు లాక్‌డౌన్ అంటే
ఉక్కు కౌగిలి కాదు
మూడు తరాల ఉమ్మడి జీవనానికి
ఆనందపు లోగిలి
ప్రకృతి వైపరిత్యంలోనూ
పల్లె పాఠం చెప్పింది
కలయికలో సుఖాన్ని విప్పి చూపింది
ఇప్పుడింక భయం లేదు
ఇంట గెలిచాం
రచ్చగెలుస్తాం.



– మద్దాళి రఘురామ్
సెల్: 9866057777

## ఈ మనిషికి ఏమైంది ?

గాలి అవిశ్రాంతంగా వీస్తూనే..
జీవులకు ప్రాణం పోస్తూనే ఉంది.
సూర్యుడు చీకటిని చిదిమి..
నిద్రను తరిమేందుకు వస్తూనే ఉన్నాడు.
ఊరపిచ్చుక కిటికీ అద్దాల్లో..
ప్రతిబింబంతో ముద్దు లాడుతూనే ఉంది.
దొడ్లోని ఆవు మాకే కాదు..
లేగదూడకూ పాలామృతాన్ని పంచుతూనే ఉంది.
జత ఎడ్లు నాగలి సాలు కోసం..
కాని ఎత్తుకొని ఎదురుచూస్తూనే ఉన్నాయి.
గొర్లు మేకలు మేత కోసమంటూ..
అడవి దారెంట కవాతు చేస్తూతూనే ఉన్నాయి.
మా ఇంటి కోడి సమయానికి..
కూస్తూ పల్లెను నిద్ర లేపుతూనే ఉంది.
గది గోడే సామ్రాజ్యమనుకుంటూ...
బల్లి భరతనాట్యం చేస్తూనే ఉంది.
ఊరి నిండా కోతులు ఇల్లిల్లూ..
తిరిగి పండూఫలం సేకరిస్తూనే ఉన్నాయి.
పెరట్లోని మల్లెతీగ వికసించి..
సుగంధాలు వెదజల్లే ఆరాటంలోనే ఉంది.
కుక్కలన్నీ రోడ్లన్నీ తమవే అన్నట్లు..
స్వేచ్ఛగా బొక్కలు కంకుతూనే ఉన్నాయి.
మామిడి చెట్లు పులుపు కాయలకు..
తీపినద్దే పనిలో నిమగ్నమవుతూనే ఉన్నాయి.
చెరువులో చేపలు ఆనందసాగరంలో..
ఈదుతూ ఆడిపాడుతూనే ఉన్నాయి.
చెరువు అలలు లయబద్ధంగా..
దరిని తాకి తన్మయత్వంలో వెనుదిరుగుతూనే ఉన్నాయి.
వాగులు, వంకలు వయ్యారంగా సిగ్గు మొగ్గలేస్తూ..
హంసల్లా ముడుచుకొని నడుస్తూనే ఉన్నాయి.
చూరులో దాగిన ఎలుకల దొంగలా..
బయటపడేందుకు తొంగి చూసితూనే ఉంది.
జీవులన్నీ మరో ప్రపంచాన్ని చూసినట్లు..
ఖైదీలైన మానవులను ఎక్కిరించ సాగాయి.

ఇంతకు ఈ నడవంత్రపు మనిషికి ఏమైనట్లు ?
బలాదూర్‌గా బజార్ల వెంట తిరగటం లేదు
వాహనాల మోతను మోగింగించటం లేదు
ఎదుటి వారిని ఆలింగనం చేసుకోవటం లేదు
బూటకపు మాయ మాటలు పలకటమే లేదు
అమానవీయ బుద్ధులు చూపడం లేదు
ఎవరు దగ్గినా, తుమ్మినా గజ్జుమంటున్నాడు
విచిత్రంగా పక్కోడు బాగుండాలని తపిస్తున్నాడు
గూట్లో దాగి ప్రాణభయంతో వణుకుతున్నాడు.

ఇంతకు ఈ మనిషికి ఏమైంది ?
ఆశ్చర్యానందంలో ప్రకృతి ఒడిన పరవసిస్తూ..
జీవరాసులన్ని స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకొని..
తమకు సోకని వైరస్‌కు వందనాలన్నాయి.
నరుని ముక్కు పిండి మూడుచెరువుల..
నీళ్ళు తాగించిన విశ్వమహమ్మారి కరోనా..
చావట్లో కూర్చున్న ప్రాణికోటికి కారణం తెలుపుతూ..
పంచభూతాలను పాడు చేసిన ఘనుడు
తను నిలిచున్న కొమ్మనే తెగనరుక్కునే..
అల్పబుద్ధిగలవాడని ఆగ్రహావేశంతో..
విశ్వమానవుల మదమనచేందుకు..
నరరూప రాక్షసుడడ నరుడేయని తీర్మానించి..
తను విశ్వరూపం దాల్చానంది వైరస్ వైరి !

మానవీయతను మదిన పునర్ ప్రతిష్టించుకొని..
ప్రకృతిని పరమ పవిత్ర దేవుడిగా పూజించి..
జీవవైవిధ్యానికి నిక్కంగా పట్టం కట్టి..
హింసాప్రవృత్తిని కూకటి వేళ్ళతో పెకిలించి..
వైరస్ గత్తర లేని లోకాన్ని నిర్మించుకోవాలనే..
గుణపాఠమే లాక్‌డౌన్‌కు అంతమని..
తెలిసి మసలుకో నవ్య మానవోత్తమా !



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## శ్రమైక విధులే.. సౌందర్య నిధులు

పనిలేక, తిండిలేక, తనవారి అండలేక
ఊరుగానిఊర వుండలేక బండలైన గుండెలతో
తన ఊరు .. తనవారన్న తాపత్రయంతో
సావైనా బ్రతుకైనా తనవారితోనేనన్న
తనరారుతున్న తపనతో తరలివెళ్తున్న
వరుసదారుల కదులుతున్న వలసకూలీలు
పుట్టచెదిరిన చీమల్లా తుట్టెకదిలిన తేనీగల్లా
మండుటెండల్లో .. ఖాళీకడుపుల్తో
ఒళ్లో పిల్లల్తో .. తలపై ముల్లెల్తో
చెప్పుల్లేని బొబ్బలుతేలిన కాళ్లతో
అబ్బా అనికూడా అనలేని నోళ్లతో
వందలాది మైళ్లుగా సాగుతున్న నడకలు
నిండు గర్భిణీల బరువైన అడుగులు
ప్రకృతి ఒడిలోనే రహదారి ప్రసవాలు
పచ్చి బాలింత పాదముద్రల నెత్తుటి జాడలు
పాలు దొరకని పాలబుగ్గల పసివాళ్లు
ఒంట్లో నీరులేక కంట్లో కన్నీరింకినోళ్లు
తడారిన కూలీల జాలిగొలుపు గమనాలు
గమ్యం చేరకముందే మరణ మజిలీలు
ఈ హృదయవిదారకమైన దృశ్యాలు
కరోనా నీకంట పడటం లేదా?
నీ కంటనీరైనా రాలటం లేదా?
ఎవరో చేసిన (సాంకేతిక) పాపానికి
ఎవరికో తగలాల్సిన శాపానికి
బడుగు జీవులెందుకు బలికావాలి?
నీ రోగంతోగాక, నీ లాక్‌డౌన్ షాక్‌తో
భద్రతలేక చితికి ఛిద్రమై పోతున్నరు!
శ్రామిక జనజీవన సౌందర్యనిధివల్లనే
సాధించగల సామాజిక నిర్మాణ సౌభాగ్యాన్ని
కాపాడుకోవాలి కరోనా..కరిగిపోవాలి నీవికనైనా!



–కె.వీణారెడ్డి
7337058025

## నాగరికత నవ్వుతుంది

నగిషి చెక్కుడు మేడల్లో
నలు దిక్కులు ఏసి గోడల్లో
నలుగుతున్న నవ నాగరికున్నిచూసి
నాగరికత నవ్వుతుంది.

అమ్మను మమ్మీ అన్నవైనం
నాన్నను డాడీగా మార్చిన జ్ఞానం
పరభాషను ప్రియంగా పలుకుతున్న
తెలుగుతనాన్నిచూసి
నాగరికత నవ్వుతుంది.

అనురాగాలు తెలియని ఆటవికం
అనుబంధాలు లేని అసమానత్వం
ఆత్మీయతాబంధాలు ఎరుగని
భారతీయున్ని చూసి
నాగరికత నవ్వుతుంది.

గాంధీతాత ఎవరని అడిగితే
మాకు గాంధీనే తెలియదు
అతని తాత గురించి మాకేం తెలుసు
అన్న అమాయక ప్రజల చూసి
నాగరికత నవ్వుతుంది.



–పి.వి. భైరవన్ శర్మ
సెల్: 8367524003

## నన్ను చంపేయండి ప్లీజ్!

నన్ను పుట్టించింది మీరు
అంతం చేయడానికి అతలాకుతలమైతుందీ మీరే
మీ మీద నాకెలాంటి కోపం లేదు
నన్నెందుకు పుట్టిచారనేది తప్ప
నన్నంటువ్యాధాని, మహమ్మారని
నన్నాడిపోసుకుంటున్నారు
అనవసరంగా నేనెవరిని అంటను, ముట్టను
మిమ్మల్నే అంటరాని వాళ్ళలా చూస్తా
నాకు స్వాభిమానం చాలా ఎక్కువ
నన్ను బొట్టు పెట్టి పిలవందే
నేనెవరింటికి వెళ్ళను.

అపరిశుభ్రంగా ఉండే వాళ్లంటే నాకసహ్యం
నాతో దోస్తీ కట్టినోళ్ళు ఒంటరిగుండక
అమాయకులకు పరిచయం చేసే వాళ్లంటే చికాకు
ముప్పుతిప్పలు పెట్టి
మూడు చెరువుల నీళ్ళు తాగిస్తా.

మేడిన్ చైనా అని చవకగా చూడొద్దు
అణువంత లేకున్నా
అణుబాంబు కన్నా ప్రమాదకారిణి
కట్టుదిట్టంగా కట్టడి చేస్తే కనుమరుగవుతా
అలసత్వం వహించిన మెరికలాంటి
అమెరికానే మెలికలు పెట్టా
తేలికగా తీసుకున్న ఇటలీ తెలిపోయి
అందాల నగరాలు అంద విహీనమైనవి
స్ట్రెయిన్ తీసుకొని స్పెయిన్ స్పాయిలైంది

ఇకనైనా మేల్కొనండి
నాపై యుద్ధం ప్రకటించండి
ఆర్థికం కన్నా ఆరోగ్యమే మేలు
నన్ను బహిష్కరించి బతికిపోండి
అందుకే...
నన్ను పుట్టించిన మీరే పట్టుపట్టి
నన్ను చంపేయండి ప్లీజ్..!



– గంగాపురం శ్రీనివాస్
9676305949

### సూటి

నిజం

సరిగా ఉంటే
గోటికి తాకుతుంది
లక్ష్యం చేరాలంటే
లడాయిలో
గులేర్ తోనైనా
విజయం సాధ్యం

ఆలోచనే
కార్యరూపం
దాలిస్తే
లక్ష్యంపై 'గురే'
ఆయుధం.



– పత్తి శివప్రసాద్
సెల్: 9440001224

# తనదేశం తన ప్రజల కోసం విలపించిన మహాకవి




నా దేశం నా ప్రజలు ఆధునిక మహాభారతం సంపూర్ణ కావ్యంలో ప్రజా పర్వంగా చేర్చారు.

అందరిలాగే కవి కూడా ఒక మనిషే. తాను మరణించినా పిడికెడు మన్నే అవుతాడు. కానీ తాను కవి అయినందువల్ల మిగిలన వాళ్లకన్న భిన్నుడవుతాడు. దాన్ని 'అంతా పిడికెడు మట్టే కావచ్చు, కలం చేతబుచ్చుకుంటే ఒక దేశపు జెండాకున్నంత పొగరుందినాకు' అని ఎంతో అందంగా చెప్పాడు మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ. తానెప్పుడు గొంతెత్తినా తన కోసం కాదు, తన రాష్ట్రంలోని ఐదుకోట్లమంది కోసమూకాదు, తన దేశంలోని యాభైకోట్లమందికోసం. తాను పడుతున్న బాధలే తన దేశం పడుతోంది. తన మానవజాతి అంతా పడుతోంది. గొంతెత్తింది యాభైకోట్లమంది కోసమే అయినా అందులో ప్రతిఫలించేది మొత్తం ప్రపంచ మానవాళి వేదన.

అందమైన ఒక్క మాట పొందడానికి తన ఆత్మను ఇనుప గునపాలతో ఎంతలోతుకు తవ్వాడో ఎవ్వరికీ తెలియదంటాడు శేషేంద్ర. సుకవి ఒక్కొక్కసారి ఒక అందమైన పదం వేయడానికి ప్రసవవేదనను భవిస్తాడు. అందుకే మనవి పొడి మాటలు, కవివి పుప్పొడి మూటలు అవుతాయి.

ఎవరైనా బాధల్ని మరచిపోవాలని తహతహలాడతారు. కానీ ఈ కవి **'నా బాధల్ని మరిచిపోనీకు, మరిచిపోతే నా చేత బ్రద్దలు కావలసిన వన్నీ క్షేమంగా వుండిపోతాయ్. హేయ్! పూవులూ, పక్షులూ మీ గొంతుకలు కట్టిపెట్టండి. నా తుపాకీ నన్ను తీసుకోనీండి'** అంటాడు (పుట 38 నాదేశం నా ప్రజలు) విలక్షణంగా. ఎందుకింత మమేకమవుతున్నాడు తన ప్రజలతో అంటే – ఆయన తన గొంతును తన ప్రజలకు దానం చేశాడు, తన జాతే తన భాషకు ప్రాణవాయువు, తన దేశం తన శిల్పానికి ఆయువు, తాను రక్త ప్రవక్త (44) కావడంవల్ల.

ఈ కవి ఇక్కడి ప్రజల్ని – అట్టడుగు ప్రజల్ని – ఎంతగా ప్రేమిస్తాడో చెప్పడానికి వీలుకాదు. 'వాళ్లు మన ప్రియమైన ప్రజలు, మన బలాన్నంతా వాళ్లకిద్దాం, ఎందుకంటే వాళ్లు మనదేశాన్ని చేస్తారు, మన చరిత్రను రాస్తారు, మన స్వప్నాల్ని నెరవేరుస్తారు' (42) అని అనితరసాధ్యంగా చెపుతాడు. 'భయమెందుకు? నీ కోసం నీవు భయపడడం కంటే నీ దేశం కోసం భయపడు. నీవు పొందే చిన్న కష్టాలకంటే నీ దేశం, నీ ప్రజలు పొందే నష్టాలు ఎంత పెద్దవో తెలుసుకో! – ఈ జరుగుతున్న సర్వనాశనంలో నిద్రాహారాలెలా రుచిస్తున్నాయి నీకు? (44) అని నిలదీస్తున్నాడు.

**'ఇక్కడ గర్భంలో వున్న శిశువు గర్భంలోనే వుండిపోవాలి. ఈ దేశంలోకి వచ్చి ఆకలి అని ఏడిస్తే ఫుట్ పాత్‌లు చూపిస్తారు. పొలాలు కాదు'** (39) అంటాడు పట్టరాని ఆక్రోశంతో. **'పిట్టయితే ఎగిరిపోతుంది. చెట్టు ఎక్కడికి పోతుంది? తుఫానులు చుట్టుముట్టినా ఆ నేలకే అంకిత మయివుంటుంది – వేళ్లతో ధరిత్రిని పట్టుకొని; సెంటు భూమి లేక పోయినా ఈ దేశాన్ని అంటిపెట్టుకొని వున్న నాలాగే'** (36) అంటాడు ఈసడింపుతో. **'ఆ మృతవీరులు మానవ ఇతిహాసంలో అమృత వీరులు. ఆ కోట్లాది పేరులేని శ్రామిక జీవులు భూమిని వదల్లేక మట్టిలో కలిసి నిరీక్షిస్తుంటారు'** (51) అంటాడు. జీవించినంతకాలం ఎదురుచూసీ చూసీ దక్కాల్సిన వేవీదక్కక, మరణించిన తరువాత కూడా ఎదురుచూస్తూనే వుంటారని ఈ వ్యవస్థ దురవస్థను వెక్కిరిస్తున్నాడు కవి. **'ఈ చెట్లు పూలెందుకు పూస్తాయి? ఈ నికృష్టపు నాగరికత విడిచే బొగ్గు పులుసు వాయువు పీలుస్తూ? ఇవి బుల్లెట్లెందుకు పూయవు?'** (28) అని కేకలేస్తానంటాడు తీవ్రధ్వనితో. **తనలో తానెందుకు మాట్లాడుకోవడం? ఇంక లాభం లేదనుకొని 'నేను చెట్లతో మొరపెట్టుకుంటున్నాను, ఆకులు కాదు తుపాకులు కాయండని'** (34) ఇలాంటి మొరపెట్టుకోవడం ఇలాతలంలో ఇంకెవ్వరూ చేసి వుండరు ఒక్క మహాకవి శేషేంద్ర తప్ప. **'నీకెందు కింత అశాంతి? నీకెందు కింత ఆవేశం? అంటే ఏం చెప్పను? సముద్రాన్ని అడుగు నీకెందుకింత అశాంతి? అని, ఝంఝా మారుతాన్ని అడుగు నీకెందు కింత ఆవేశం అని'** (23) తలతిరిగే సమాధానం చెప్పలేని ఎదురు ప్రశ్నలు వేస్తాడు.



1977లో ఫైజ్ అహ్మద్‌తో...

ఈ దేశం వ్యావసాయిక దేశం. అందుకే కర్షకుల పక్షాన నిలబడతాడు కవి. 'కృషి చేస్తేగానీ బతుకు గడవని వాడు కర్షకుడు. నాగలి పట్టుకుని నేలను **'దున్నే వాడు ఆ జాతికంతా చిహ్నం. కర్షకుడి జీవిత ంలో ఏ గాథ లుంటాయి? శ్రమ శ్రమ శ్రమ తప్ప'** అంటాడు. నాగలితో దున్నే మనిషి గుర్తు కనీసం ఈ దేశపు జెండా మీద అయి నా వుంటే బాగుం దేదని సూచన చేస్తున్నాడు కవి. **'కర్షకుడు యుగయుగాల బాధలు అనుభవిస్తూ ధీరత్వం విడనాడకుండా లోకాన్ని రక్షించే కృషిచేస్తూనే వున్నాడు'** అంటాడు. భూమి పుత్రుల క్షమపైన, శక్తిపైన ప్రశంసలవర్షం కురిపించాడు. కవి కనికరపు కన్ను రైతు తరువాత సహజంగా రైతు బిడ్డ మీద పడింది గమనించండి.

**'ఎక్కడ తిండిలేని పసివాడు దూడను మేతకు తీసుకుపోతు న్నాడో**
ఎక్కడ పసితనం కూడా బతకడానికి పనిచెయ్యాలో
అక్కడ నా కాళ్ళు నిజంగా తెగిపోయాయి.
నా చేతులు నిజంగా రాలిపోయాయి
నా నాలిక నిజంగా పడిపోయింది...'

ఆ పసివాడి కాళ్లమీద కడివెడు కన్నీళు పోశా (50) నంటాడు. ఈ పసివాణ్ణి గురించి ఆలోచిస్తుంటే అమృతం కురిసిన రాత్రిలో తిలక్ చూపించిన **'తల్లిలేక, తండ్రిలేక, తిండిలేక ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ మురికి కాల్వ పక్కనే నిద్రించిన మూడేళ్ల పసిబాలుడు'** మనకు స్ఫురణకు వస్తాడు. నాకే లేదు నీ గురించి నేనెందుకు పట్టించుకోవాలనే భావన లేకుండా నిస్వార్థంగా పరోపకార పరాయణతతో తిండి లేని పసివాడు మేతలేని దూడను మేతకు తీసుకుపోతున్న దృశ్యం సహృదయుల హృదయాలను కలచివేస్తుంది. ఆ పసివాడి కాళ్లముందు కడివెడు కన్నీళ్లు కుమ్మరించడడం సామాన్యులె వరికీ సాధ్యం కాదు, రోజుకు వెయ్యిసార్లు ఏడ్చే (47) సుకవికే, యుగకవి శేషేంద్రకే సాధ్యం.

కవి సైన్యాధ్యక్షుడి లాంటివాడు. భయపడితే కవి భయపడుతుంది భువి. 'సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చొని మొరగదు. తుఫాను గొంతు, చిత్తం అనడం ఎరగదు. పర్వతం ఎవరికి వొంగి సలాం చెయ్యదు.(27) **'అణచివేతను ఎదిరించే ప్రకృతి మనిషిలో స్వభావ సిద్ధంగా వుంటుంది'** అంటాడు టాసిటస్. 'మోకరిల్లి బతకడం కంటే కాళ్లమీద నిలబడి మరణించడం మేలు' అంటాడు నార్మన్ బెతూన్. ఆ స్ఫూర్తితోనే ఈ జాతిలో వుండే బానిస తనాన్ని ఈసడించాడు శేషేంద్ర. **'ఈ కాలపు మనిషి ఒక అధిపతికి లొంగడు. ఎవడి యాజమాన్యాన్నీ అంగీకరించడు. స్వతంత్ర ప్రతిపత్తి తన హక్కు అని నమ్ముతాడు'** (10) అంటూ **'నా దేశంలో నాయకత్వం నాదే; దాన్ని రాజకీయాల బారికి అప్పగించను'** (44) అన్నప్పుడు **'ఆకటికిన్ గొనిపోయి అల్ల కర్ణాట కిరాటా కీచకుల కమ్మ త్రిశుద్ధిగనమ్ము భారతీ!'** అన్న పోతన్న మన కనులముందు సాక్షాత్కరిస్తాడు. **'రండి! పద్యాలు బందూకులుగా ధరించి, సేనల్లా, తుపాకుల్లా రండి! సమయం కోసం మీరు మబ్బుల్లో దాచుకున్న పిడుగులు తీసుకొని రండి!'** అన్నప్పుడు అజ్ఞాతవాస సమయంలోని అమిత బలశాలులైన పాండవులూ, వాళ్ల శమీవృక్షం మీద దాచివుంచిన అత్యంత శక్తివంతమైన ఆయుధాలూ గుర్తుకువస్తాయి.



1971 జనవరి 26న జరిగిన అఖిలభారత ఏ.ఐ.ఆర్. కవి సమ్మేళనంలో ఉర్దూ కవి జాన్ నిసార్ అఖ్తర్‌తో...

అయితే ఈ మధ్య కొంతమంది గులాంగిరికి అలవాటు పడుతున్నారు. అందుకే కలం కొరడా ఝుళిపిస్తున్నాడు కవి. ఈ దేశంలో ఒంగేవాడికి ఒంగి సలామ్ చేసేవాడు పుడుతున్నాడు. జాగ్రత్త. ఈ లక్షణం తలయెత్తిందంటే ఆకాశంలో తోకచుక్క పుట్టిందన్నమాటే (54) అంటాడు. ఏదో ఒక మహోపద్రవం ముంచుకొస్తుందని జాతిని హెచ్చరిస్తున్నాడు.

తాను తలెత్తుకొని తిరగడమే కాక జాతి జనాలందరినీ తలెత్తుకొని తిరగమంటాడు. నిరంతరం స్వతంత్రంగా బతకమంటాడు.

అమాయకపు బాల్యందాటుతుండగానే 'నీవు కాలేజీ గోడల్లోకి పోతావు. అక్కడ్నించి గవర్నమెంటు గోడల్లోకి పోతావు. అక్కడ్నించి ఎప్పుడూ ఎవ్వరూ తిరిగిరాని గోడల్లోకి పోతావు. ఇక నీవు బ్రతికిందెప్పుడు? మీ నాన్నలతరం అదే చేసింది. మీకు ఆ ప్రశ్నే వారసత్వంగా ఇచ్చిపోయింది. ప్రతి అవయవానికి దానిదైన ఒక ప్రత్యేకత వుంటుంది. అది ఆ పనిని సరిగా నిర్వర్తించనప్పుడు దాని అవసరం ఏమి వుంటుంది? అది వున్నా ఒకటే లేకున్నా ఒకటే. దాన్నే స్పష్టీకరిస్తున్నాడు పరిణతిచెందిన కవి.



2005లో కేంద్ర సాహిత్య అకాడమీ స్వర్ణ జయంతి వేడుకల్లో స్వర్ణ పతకం బహూకరిస్తున్న ప్రధాని మన్మోహన్ సింగ్.



1996లో రాజ్ భవన్‌లో శేషేంద్రశర్మ మొట్ట మొదటి జీవిత చరిత్ర (బయోగ్రఫీ) హిందీ పుస్తకం శేషేంద్రశర్మకు ఇస్తున్న ఏపీ గవర్నర్ కృష్ణకాంత్

**"ఎందుకు నీకా గుండె నీవు దాన్ని బాధలతో నింపుకోలేకపోతే?**
**ఎందుకు నీకా కళ్ళు నీవు వాటిని కన్నీటితో తడుపుకోలేకపోతే?"**
**అని నిలదీసి అంతటితో ఆగడు.**
**'రోజూ నేను వెయ్యిసార్లు ఏడుస్తాను నీకు తెలుసా?'** (47) అంటాడు.

నీ గుండెను బాధలతో, కళ్లను అశ్రువులతో నింపుకోవడం కవిగా నీ కర్తవ్యం, నీ బాధ్యత అంటున్నాడు. తన కోసం తానేడిస్తే మనిషి, మనకోసం తానేడిస్తే మనీషి. మన కోసం, సమస్త మానవాళికోసం ప్రతిదినం వేనవేలసార్లు ఏడ్చిన మహాకవి ఋణాన్ని తీర్చుకోవడం ఎలా?

పాము కాటుతో భస్మమవుతున్న ఓ నా ప్రజలారా! రండి. మీకో కొత్త పద్యం ఇస్తా. ఈ పద్యం మీకో కొత్త ప్రాణం ఇస్తుంది. ఒక కొత్త ప్రయాణం ఇస్తుంది. నాగస్వరం ఊదే క్షుద్ర విద్య నేర్చుకోకండి. పామును చంపే ఉన్నత విద్య నేర్చుకోండి' (54) అంటాడు. తన జాతి జనుల్ని ఉద్ధరించడానికి కవి పడుతున్న నిరంతర వేదనకు నిలువెత్తు సాక్ష్యాలు ఈ వాక్యాలు. అందుకే ఈ కవే ఇంకొకచోట అంటాడు 'కవులూ నదులూ ఈ భూగోళపు రక్తనాళాలు' అని.



1995లో నక్సల్స్‌పై నిషేధం ఎత్తేయాలని ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుని కలిసిన పౌరహక్కుల బృందంతో...



2005లో హంస అవార్డును అందజేస్తున్న ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖర్ రెడ్డి...

1984లో వరంగల్లులో జరిగిన పోతన పంచశతి జయంతి ఉత్సవాలలో మహాకవి శేషేంద్ర అన్న వాక్యాల్ని స్మరించుకుందాం.

కవి అన్నవాడు రక్తమాంసాకృతికాదు; అక్షరాకృతిట

మామూలు మనుషులు చనిపోతే వాళ్ళపని అంతటితో అయిపోతుంది. కవి జీవించివున్న కాలం తక్కువ. పరమపదించిన తరువాత బతికిన కాలమే ఎక్కువ. ఎందుకంటే అతనిది అక్ష రమైన ఆకారం అంటే నాశనంలేని ఆకారం కావడంవల్ల. వర్ధంతి సంద ర్భంగా మహాకవి శేషేంద్రకు అశ్రునివాళి.




1949లో మాతృమూర్తి కీ॥శే॥ అమ్మాయమ్మ, కుటుంబ సభ్యులతో...




1962లో అర్థాంగి, కొడుకు, కూతుళ్ళతో...



–ఆచార్య పి.ఎల్. శ్రీనివాసులు రెడ్డి
9441493777



1987లో గ్రీక్ కవి యానీస్ రిట్సోస్‌తో...



1995లో నక్సల్స్ మీద నిషేధం ఎత్తేయాలని జరిగిన బహిరంగ సభలో కాళోజీ, బొజ్జా తారకంలతో..

## మార్గదర్శకమైన "రేడియో రూపకాలు"

పుస్తక సమీక్ష




ముందు తరాలలో ఆకాశవాణి కేంద్రాలు ప్రతి ఇంట్లో కొలువై ఉండి ఒక విధంగా ఎంతో ఆనందాన్ని మనకు అందించేవి. వివిధ రకాలైన కార్యక్రమాలను, ప్రయోగాలను చేస్తూ, అనేక రకాల రూపకాలను ప్రసారం చేసేవి. మనకు రూపకాలు అనగానే బాలాంత్రపు రజనీకాంత్‌రావు, దాశరధి కృష్ణమాచార్యులు, శశాంక, ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ తదితరులు మనకు వెంటనే గుర్తుకు వచ్చే ప్రముఖులు. ముఖ్యంగా శ్రవ్య మార్గానికే అంకితమైన ఆకాశవాణి 1947 తర్వాత అనేక రకాల ప్రక్రియలతో దక్షిణాది ఆకాశవాణి కేంద్రాల రూపకాలను ప్రసారం చేసాయి. అలాగని దృశ్య ప్రక్రియలు లేవని కాదు. అప్పుడప్పుడు వినూత్నమైన కార్యక్రమాలతో ఆకాశవాణి కళాకారులు దృశ్య, శ్రవ్య, ఆహార్య ప్రక్రియలను తమ వినటంలోనే వినూత్నంగా కంటికి కనిపించేలా చేసేవారు.

రూపకాలు శ్రవణ ప్రక్రియ అయినప్పుడు అందులో ముఖాముఖి సంభాషణలు ఇతివృత్తానికి అనుగుణంగా ప్రయోక్తల ద్వారా లేదా గీతాల ద్వారా వివరణాత్మకమవుతోంది. ఇది కేవలం శ్రవ్య సాధకమైన ఆకాశవాణికే ఏకస్వామ్యప్రక్రియగా స్థిరపడింది. ఈ ప్రక్రియ ఇతివృత్తం వస్తువుకు అనుగుణంగా విస్తరిస్తే ఎన్నుకున్న వస్తువు మాత్రం కొన్ని ఆనందాన్ని, కొన్ని జ్ఞానాన్ని అందించేవిగా ఉంటాయి. ఈ రూపక ప్రక్రియలు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం పాత తరం రచయితలతో పాటు, నూతన రచయితలను కూడా ప్రోత్సాహం ఇవ్వడం మనం గమనిస్తూనే ఉన్నాం. అయితే ఇలాంటి అరుదైన రూపకాలకు జీవాన్ని అందించిన ఈ రచయిత రమణ గారి పెదనాన్న శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ గారు తమ వారసత్వాన్ని , వారికున్న ఆకాశవాణి అనుభవంతో రూపకాలు రచించి, ప్రసారమైన రూపకాలను గ్రంథస్థం చేయడం హర్షించదగిన విషయం. ఈ గ్రంథంలో 12 రూపకాలు ఉన్నాయి. వీటిలో చారిత్రక ఇతివృత్తాలలో ఇమిడివున్నవి రెండయితే, మిగిలిన ఎనిమిది వివిధ వస్తువులను, అంశాలను తెలియజేసాయి. ముఖ్యంగా రణతంత్ర ఛత్రపతి అనే రూపకంలో మలచిన పాత్రలు, ప్రధానాంశం ఎంతో ఆకట్టుకుంటుంది. చారిత్రక సేకరణను ఎంతో హుందాగా మలచారు. ఇందులోని పాత్రలకు ఏమాత్రం గౌరవం తగ్గకుండా కాపాడటంలో ఎంతో కృతకృత్యులయ్యారు. అలాగే పద ప్రయోగాలు పలికించడంలో ఎంతో ఆసక్తిని కలిగించారు. అందుకు శివాజీ పాత్ర ఉదాహరణ. 'ఘనసార చరిత్ర' లోని తేటతెల్లం చేసిన స్వేచ్ఛాపోరాటాలు ఎంతో ఔచిత్యవంతంగా సాగాయి. మరో రూపకం "అంబేద్కర్" లో మానవీయత స్పష్టంగా చూపారు. ఆనాటి స్థితిగతులు, వైరుధ్యాలు ప్రత్యక్షంగా కళ్ళముందు ఉంచారనే చెప్పాలి. ఈ రూపకమంతా మానవీయ కోణం చుట్టూరా తిరుగుతుంది. అంబేద్కర్ బాల్యమైనా, ఆలోచనా విధానమైనా, వారిలోని దృష్టి కోణాన్ని తేటతెల్లం చేసిన తీరు సమాజానికి పాఠంలా అనిపించింది. అంటరానితనం అనే ఆలోచనా విధానాన్ని రూపుమాపాలని చేసిన అంబేద్కర్ ప్రయత్నం భావితరాలకు మార్గదర్శకంగా మలిచారు. వ్యంగ్యం, సమయోచిత హాస్యం గురించి ఈ రచయితకు చెప్పక్కర్లేదని చదివినవారందరికీ తేటతెల్లమవుతుందనే చెప్పాలి.

ఇలా వివిధ సందర్భాలలో ఆకాశవాణిలో ప్రసారమైన రమణారావు రూపకాలు ఎంతో ఆసక్తికరంగా సాగాయి. మొత్తానికి ఈ రూపకాలన్నింటిలోనూ సామాజిక బాధ్యత , సామాజిక సంస్కరణ, ఆవశ్యకత అనే విషయాలకు ప్రాణం పోసారనే చెప్పాలి. రూపకాల రూపురేఖల ప్రాశస్త్యాన్ని రచయిత బొల్లిముంత వెంకటరమణ సంపూర్ణంగా తెలియజేసారు. రచన అనేది పదికాలాలు నిలిచిపోవాడానికి, పదిమందిని బాగుచేయడానికి అనే మాటల్లోని నిజాన్ని గ్రహించాలంటే ఈ రూపకాలు చదవాల్సిందే.. అభినందనలు

ప్రతులకు: బి.వి. రమణారావు,
ఫోన్: 8106713351

–శైలజామిత్ర

## సంద్రపు అమ్మతనం

ఎగసిపడే అలల ఉధృతి కాదు
కోట్ల జీవాలకు ఇల్లైన
సంద్రపు అమ్మతనాన్ని చూడు

వాళ్లు మేడిపండ్లు కారు
పైపైన కటువుతనం
అలంకరించుకుని
లోన కారుణ్యాన్ని పొదిగి ఉంటారు...
బంధువు కాని బంధువు లై
దేశపు బంధాన్ని కాపాడుతూ...
కంటి కునుకుని మన భద్రతకు తాకట్టు పెట్టారు...
రహదారి డైనింగ్ టేబుల్ పైన
అన్నపు పోగులను
ఆకలి కండెకు చుడుతున్నారు..

పిల్లలెక్కడ చుట్టుకుంటారేమోనని...
రాత్రెపుడో అపరిచితునిలా ఇంట్లోకి జొరబడె
బాధనెలా తట్టుకుంటున్నారో...!

మీకోసమే ఈ పాదరసపు దారుల్లో ..
కాపలా అంటూ వినయంగా ప్రణమిల్లు తున్నారు
కళ్లు తెరవండంటూ... త్రోవలనే స్టేజీలుగా
నృత్య రూపక పాత్రలు పోషిస్తున్నారు
వలస పాదయాత్రలకు ఆహారపు పొట్లాలవుతున్నారు
అనాధలకు అమ్మలవుతున్నారు
నిను ఇంట్లో భద్రంగా ఉండనిచ్చి
నీ బదులు నేనంటూ పురుగు కాటుకి బలై జీవిత
పుస్తకంలో అక్షరాలను చెరిపేసుకుంటున్నారు
వారి తోడుకి నీదై నిలవాల్సిన సమయమిది
ఏ వస్తువులో దాగుందో
ఏ చేతి నుండి చేరుతుందో అగమ్య గోచరమైనా....
లాక్ డౌన్ మంత్రాన్ని సరిగ్గా జపిస్తే
కోరలు చాచిన పామును
కుక్కిన పేనుని చేసి గమ్యాన్ని చేరగలం.

–అవ్వారు. శ్రీధర్ బాబు
సెల్ 8500130770

